ప్రజాశక్తి
శుక్రవారం 18 అక్టోబర్ 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

కిక్కు... ఎవరికి?



- 'తగ్గేదే లే... అంటూ సర్కారీ అబ్కారీ' విధానం...
- మరో 3 నెలల వరకూ పాత ధరలే
- దందా వారిదే... అంతా ఊహించిందే...

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ఆగలేం కదా...కొనాల్సిందే...తాగాల్సిందే..' అంటూ మందు బాబులు తాజాగా ఎక్కడ చూసినా షాపుల నుంచి బాటిల్స్ తెచ్చుకుని అక్కడే పెదవి విరుస్తున్నారు మరి. విశాఖ జిల్లాలో 155 చోట్ల షాపులు తెరుచుకున్నాయి. తాగేవారంతా ఎక్కడికక్కడ షాపుల్లోకి జొరబడుతూ తమ తమ బ్రాండ్ల కోసం కళ్లు కాయలు కాసేలా రెండు రోజులుగా కలియతిరగడం కనిపించింది. ఏ బ్రాండ్ల కోసమైతే కొత్త కూటమి ప్రభుత్వంలో మద్యాన్ని తాగేవారంతా ఎదురు చూశారో ఆ బ్రాండ్లు మచ్చుకైనా కానరాకపోవడం 'ఇదేమి సురాపానం' అంటూ వారిలో కనిపించే మొదటి నిరాశ. కాగా మద్యం ధరలు సైతం పైకెక్కినవి దిగకపోవడంతో ఈ సారి కూడా ఆశించిన కిక్ రావడం లేదంటూ బాహాటంగానే వీరు వాపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మందు బాబులకు తొలి పండగైన 'దసరా' నుంచి తమకు 'కిక్' ఎక్కే సరదా లభిస్తుందని అన్ని చోట్లా ఎదురు చూసిన సంగతి తెలిసిందే. హుషారుగా కనిపించే వీరంతా తాజాగా విచారం వ్యక్తం చేస్తున్నారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఎందుకంటే భవిష్యత్తులో ధరలు కూడా తగ్గుతాయన్న గ్యారెంట ఏమీలేదు. దీంతో 'కిక్' రాజకీయ వ్యాపారులకే తప్ప తమకుండేనా? అంటూ బెంగ పెట్టుకుంటున్నారు.

బయటకు ఒక్క షాపూ వెళ్లకుండా అధికార 'వ్యూహం'...

విశాఖలో పరిస్థితి చూస్తే 155 మద్యం షాపులకు జరిగిన వేలంలో 'దందా' అంతా అధికార పార్టీ నేతలు, అనుయాయులదే.. అక్కడ ఇక్కడా అనే ఎలాంటి తేడా లేకుండా షాపులు మొత్తం నాయకులే వేలం పాటల వద్ద, దరఖాస్తులు చేసుకున్న దగ్గరా దగ్గరుండీ దక్కించుకోవడం అంతటా చర్చనీయాంశమైంది. రూ.2లక్షలు నాన్ రిఫండబుల్ ఫీజు కూడా వీరికి ఎక్కువ కాకపోవడంతో ఒక్కో నాయకుడు 20 నుంచి 50 షాపుల వరకూ దరఖాస్తులు పెట్టుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఒక ప్రముఖ

మిగతా 2లో..

విశాఖ జిల్లా టెండర్ల ఆదాయం...

ప్రభుత్వానికి దరఖాస్తులు, లైసెన్సు ఫీజు ద్వారా 'కిక్' ఎక్కగా, రాజకీయ మద్యం వ్యాపారులకు 'అమ్మకాల'తో కిక్ లభించనుంది. మద్యం టెండర్ల దరఖాస్తులు ద్వారా వచ్చిన ఆదాయం రూ.82.78కోట్లు కాగా దరఖాస్తులు మొత్తంగా 4139 వచ్చాయి. లైసెన్సు ఫీజు ద్వారా వచ్చిన ఆదాయం జివిఎంసి విశాఖపట్నం పరిధిలోగల 124 షాపులకు, షాపునకు రూ.85లక్షలు చొప్పున చూస్తే మొత్తంగా రూ.105.40కోట్లు లభించింది. జివిఎంసి అనకాపల్లి పరిధిలో 12 షాపులకు షాపునకు రూ.85లక్షలు చొప్పున రూ.10.20కోట్లు ఆదాయం లభించింది. విశాఖపట్నం గ్రామీణ ప్రాంతం 19 షాపులు (భీమిలి, ఆనందపురం, పద్మనాభం) షాపునకు రూ.65 లక్షలు చొప్పున రూ.12.35కోట్లు లైసెన్సు ఫీజు లభించింది. విశాఖ జిల్లాలోగల 155 షాపులకు రూ.127.95కోట్లు రాగా దీనికి లైసెన్సు ఫీజు కూడా కలిపితే మొత్తం ఆదాయం రూ.210.73కోట్లు లభించింది.

జిత్తులమారి అభిజిత్

- బకాయిలు ఎగ్గొట్టేందుకు కుంటిసాకులు
- చట్ట విరుద్ధంగా లే ఆఫ్
- ప్రభుత్వ శాఖలకు ఇవ్వని ముందస్తు సమాచారం
- సిఐటియు నేతృత్వంలో కార్మికుల నిరసన



ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

కొత్త పరిశ్రమల రాకకు పరితపిస్తున్నట్లు చెబుతున్న ప్రభుత్వం, సవ్యంగా నడిచే పరిశ్రమలను అకారణంగా మూసేసిన యాజమాన్యంపై చర్యలు తీసుకొని, కంపెనీని తెరపించడానికి చొరవ చూపడంలేదు. అచ్యుతాపురంలో సెజ్‌లో వందల కోట్ల రూపాయల రాయితీలు పొందిన పరిశ్రమాధిపతులు, ఇష్టానుసారంగా నిబంధనలు ఉల్లంఘించి ప్రవర్తించినా ప్రభుత్వ యంత్రాంగం నోరు విప్పడంలేదు. సెజ్ కోసం చౌకగా భూములిచ్చిన రైతుల ఉపాధి దెబ్బతీసినా స్పందించడంలేదు. అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లోని అభిజిత్ ఫెర్రోటెక్ పరిశ్రమ యాజమాన్యం నిబంధనలు గాలికొదిలి లే ఆఫ్

మిగతా 2లో..

యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి

అభిజిత్ యాజమాన్యం కార్మికులను బెదిరించడానికి లే ఆఫ్ ప్రకటించింది. ప్రభుత్వ అనుమతులు లేకుండా లే ఆఫ్ ప్రకటించడం చట్ట వ్యతిరేకం. కోట్ల రూపాయల విలువైన అనేక రాయితీలు ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలు పొందాయి. కార్మికులకు కనీస వేతనాలు అమలుచేయడంలేదు. గతంలో ఇస్తామన్న డస్ట్, రవాణా అలవెన్స్ ఇవ్వడంలేదు. జిఒ కంటే మహిళలకు తక్కువ జీతాలు చెల్లిస్తున్నారు. కార్మికులకు నష్టపరిహారం, బోనస్ బకాయి చెల్లించకుండా ఎగ్గొట్టడానికి యాజమాన్యం చేస్తున్న కుట్ర ఇది. యాజమాన్యాన్ని ప్రాసిక్యూట్ చేసి అరెస్టు చేయాలి. కార్మికులకు బకాయిలన్నీ చెల్లించాలి. లే ఆఫ్‌ను ఎత్తివేసి కార్మికులందరికీ పనికల్పించి పూర్తి జీతం చెల్లించాలి.



జి.కోటేశ్వరరావు,
సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి

రైల్వే స్టేషన్‌లో 18 కేజీల గంజాయి స్వాధీనం

▶ వార్త 3లో..

విద్యార్థులకు చేరువగా విజ్ఞానాత్మక కేంద్రాలు

▶ వార్త 8లో..

ఆరోగ్య కేంద్రాల సిబ్బంది అందుబాటులో ఉండాలి

▶ వార్త 8లో..

నగరం జలమయం : పలు రోడ్లు ధ్వంసం

▶ వార్త 2లో..



ఇళ్ల నిర్మాణాల పురోగతిపై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 1.0 పథకంలో లబ్ధిపొందిన వారికి 2.0లో గృహ సంబంధిత పథకంలో అవకాశం ఉండదని, ఇప్పుడు మంజూరైన ఇళ్లను ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువులోగా పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇతర అంశాలపై గురువారం కలెక్టరేట్ మీటింగు హాలులో గృహ నిర్మాణ శాఖ అధికారులు, మండల లే-అవుట్ ఇన్‌ఛార్జులు, ఇతర అధికారులతో ఆయన గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మార్గనిర్దేశకాలు జారీ చేశారు. అధికారులు, గుత్తేదార్ల సమన్వయంతో వ్యవహరించి లే-అవుట్లలో చేపట్టిన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, సొంత స్థలంలో కట్టుకునే వారు కూడా త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని హితవు పలికారు.

పిఎం ఆవాస్ యోజన 2.0 కోసం ఆలోచిస్తూ

మిగతా 2లో..

ఆర్థిక మోసాల ముఠా అరెస్టు

ప్రధాన నిందితులకు చైనా, తైవాన్ సైబర్ మోసగాళ్లతో సంబంధాలు : సిపి శంకబ్రత బాగ్చీ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : స్టాక్ మార్కెటింగ్, టాస్క్ ఆధారిత బెట్టింగ్, ఫెడెక్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలకు పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బాగ్చి తెలిపారు. గురువారం సాయంత్రం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆర్‌బిఐ అనుమతి లేని అనేక బెట్టింగులు, ఇన్వెస్ట్‌మెంట్ స్కీముల పేరుతో పీస్ పే అనే చెల్లింపు గేట్ వే ద్వారా ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న ముఠాను అహ్మదాబాద్ పోలీసుల సహకారంతో విశాఖ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తించినట్లు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఎఎన్ బీచ్ హాస్పిటల్ పక్కన ఉన్న సి స్మైల్ అపార్ట్‌మెంట్‌లో సోదాలు నిర్వహించగా ఈ మోసాలకు పాల్పడుతున్న నలుగురు యువతులు, ముగ్గురు పురుషులను గుర్తించి అదుపులోకి తీసుకున్నామని వివరించారు. వారి నుంచి కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, భారీగా సాంకేతిక పరికరాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ సామాగ్రిని ఉపయోగించి తప్పుడు బ్యాంకు ఖాతాలతో బెట్టింగ్ యాప్‌ల ద్వారా సైబర్ మోసాలకు పాల్పడినట్టు నిర్ధారించామని వెల్లడించారు. వీరిలో ప్రధాన నిందితులైన ఈ సెంటర్ నిర్వాహకులు సాయిరాం, గిరీష్‌లు స్థానిక యువతులకు ఉద్యోగాలను ఆశ చూపి రూ.25 వేలు చొప్పున జీతాలు చెల్లించి ఈ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అనంతరం విచారణలో భాగంగా ప్రధాన అనుమానితులను విశాలాక్షి నగర్ సమీపంలోని

మిగతా 2లో..



స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు, బ్యాంకు చెక్‌బుక్‌లను చూపిస్తున్న నగర పోలీసు కమిషనర్ శంకబ్రత బాగ్చీ

మొదటి పేజీ తరువాయి..

జిత్తులమారి 'అభిజిత్'

ప్రకటించింది. లే ఆఫ్ ప్రకటించడానికి ముందుగానీ, లే ఆఫ్‌కు కారణంగానీ సంబంధిత ప్రభుత్వశాఖలకు అభిజిత్ యాజమాన్యం తెలియజేయలేదు. లే ఆఫ్ ముందస్తు సమాచారం ఏమీ ఇవ్వలేదని కార్మికశాఖ, సెజ్ అధికారులు తెలిపారు. మెయిల్ ద్వారా లే ఆఫ్ విషయం తెలియజేసి యాజమాన్యం చేతులు దులుపుకుంది. ఏ నిబంధనలు పాటించకుండా పరిశ్రమను మూసేసి వెయ్యి మంది కార్మిక కుటుంబాల ఉపాధి దెబ్బతీసింది.

లే ఆఫ్ ప్రకటించిన సోమవారం నుంచి సిఐటియు నేతృత్వంలో కార్మికులు ఆందోళన కొనసాగిస్తున్నారు. పరిశ్రమను తెరిపించి ఉపాధి కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అకస్మాత్తుగా పరిశ్రమను మూసేస్తే తమ కుటుంబాలెలా బతుకుతాయని ప్రశ్నిస్తున్నారు. ముడిసరుకు లేకపోయినా, విద్యుత్ సరఫరా నిలిచిపోయినా, పరిశ్రమ మరమ్మతుకు గురైనా, ప్రకృతి విపత్తులకు పరిశ్రమ దెబ్బతిని నడపలేని పరిస్థితి ఏర్పడితే వాస్తవ సమాచారం ముందుగా సంబంధిత శాఖలకు తెలియజేయాల్సివుంది. కానీ లే ఆఫ్‌కు సరైన, నమ్మదగిన కారణాలేవీ యాజమాన్యం చెప్పకుండా పరిశ్రమను మూసింది. మార్కెట్‌లో ధరలేదని, ముడిసరుకు ధర పెరిగిపోయిందని తప్పుడు ప్రచారానికి యాజమాన్యం ఒడిగట్టింది. అభిజిత్‌కు ఎగుమతుల సమస్యలేదని ఓ అధికారి తెలిపారు.

అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లో సుందరం, మైతాన్ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలు యథాతథంగా నడుస్తున్నాయి. అభిజిత్ పరిశ్రమ యాజమాన్యం మాత్రం ముడిసరుకు, మార్కెట్ సమస్యంటూ కుంటిసాకులు చెబుతోంది. అభిజిత్ యాజమాన్యం ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్)కు సుమారు రూ.273 కోట్లు చెల్లించాల్సివుంది. ఈ తరహా బకాయిలు, పన్నుల నుంచి మినహాయింపు పొందడానికి లే ఆఫ్ అస్త్రాన్ని సంధించింది. ప్రభుత్వ యంత్రాంగం వాస్తవ పరిస్థితులను ప్రభుత్వానికి తెలియజేసి, పరిశ్రమను తెరిపించి, కార్మికులకు ఉపాధి కల్పించే చొరవ చూపడంలేదు. పరిశ్రమను తెరిపించి ఉపాధి కల్పించాలని కార్మికులు అనివార్య పరిస్థితుల్లో ఆందోళన కొనసాగిస్తున్నారు.

ఆర్థిక మోసాల ముఠా అరెస్టు

ఒక అపార్ట్‌మెంట్‌లో గుర్తించామని వివరించారు. వారి వద్ద భారీ సంఖ్యలో బ్యాంకు ఖాతాలు, రిజిస్ట్రేషన్ కానీ సిమ్ కార్డులు, డెబిట్ కార్డులు, ల్యాప్‌టాప్‌లు గుర్తించామని తెలిపారు. వీరికి, చైనా, తైవాన్‌లకు చెందిన సైబర్ నేరగాళ్ల మధ్య ఇప్పటివరకు సుమారు రూ.తొమ్మిది కోట్ల లావాదేవీలు జరిగాయని గుర్తించామని చెప్పారు. వీరి నుంచి టిఆర్అక్స్ ఆటోమేషన్ యంత్రాలు, నగదు లెక్కింపు యంత్రాలు, భారీగా చెక్ బుక్‌లు లభించాయని తెలిపారు. ఈ మోసాలకు మూలాలు చైనాలో ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. విచారణ మరింత లోతుగా జరుగుతుందని, ప్రధాన నిందితుడు సాయిరాం తైవాన్‌లో నివాసముంటున్న అతని స్నేహితుడు సూర్య మోహన్ ద్వారా ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని తెలిపారు. స్థానికంగా ఉండే సాయిరాం సన్నిహితుడైన గిరీష్ ద్వారా అనేక మంది యువతులతో ఆన్‌లైన్ బెట్టింగ్ ప్రమోషన్ల కోసం కాల్ సెంటర్ నిర్వహిస్తున్నాడని పేర్కొన్నారు. ఈ సోదాల్లో ఒక డెస్క్ టాప్, 9 ల్యాప్‌టాప్‌లు, 8 సిపియులు, తొమ్మిది మోనిటర్లు, టిఆర్అక్స్ యంత్రాలు 5, టిపి లింకు వైఫై రూటర్ ఒకటి, 65 మొబైల్ ఫోన్లు, 699 బ్యాంకు ఖాతాలు వాటి చెక్ బుక్‌లు, 135 రిజిస్ట్రేషన్ కాని సిమ్ కార్డులు, ఒక బైక్, ఒక కారు, మూడు బంగారు రింగులు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ మీడియా సమావేశంలో డిసిపి – 1 అజితా వేజెండ్ల, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ భవాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష

కొంతమంది లబ్ధిదారులు ముందుకు రావటం లేదని అధికారులు ప్రస్తావించగా స్పందించిన కలెక్టర్ ప్రభుత్వ నిబంధనల ప్రకారం 1.0లో లబ్ధి పొందిన వారికి 2.0లో అవకాశం రాదని, మార్పులు చేర్పులు ఉండబోవని స్పష్టం చేశారు. కొత్తవారికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని లబ్ధిదారులకు బాగా అర్థమయ్యేలా చెప్పాలని అధికారులు బాధ్యత తీసుకోవాలని, క్షేత్రస్థాయి అధికారులు విడమరిచి చెప్పాలని, ఇప్పుడు మంజూరైన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకునేలా ప్రోత్సాహం అందించాలని సూచించారు. ఇంటిటికీ వెళ్లి లబ్ధిదారులను ఒప్పించాలన్నారు. ఉన్న నిధులను సద్వినియోగం చేసుకునేందుకు అందరూ చొరవ చూపాలన్నారు. ఇళ్ల నిర్మాణాల పనుల్లో మరింత జోరు పెంచాలని, నిర్దేశిత కాలంలోగా పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రోజువారీ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని పనులను చేయాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలని నిర్దేశించారు.

మొదటి పేజీ తరువాయి..

కిక్కు... ఎవరికి?

టిడిపి నేత 11 షాపులు (ఇంకెవ్వరికీ వెళ్లకుండా) దక్కించుకున్న విషయం పెద్ద ఎత్తున మూడు జిల్లాల్లో చర్చ నీయాంశమైంది. ఈ మొత్తం జాతర 10 రోజులకు పైగా సాగింది. 16వ తేదీన షాపుల కేటాయింపు జరిగింది. పదుల సంఖ్యలో రూ.2లక్షలు పోయినా ఒకటి అరా షాపులు దక్కడంతో నాయకులు సరిపెట్టుకున్నారు. ఇప్పుడింకా వీరి వంతు. బెల్టు షాపులకు సైతం మందు సరఫరా ఇక్కడ నుంచే మొదలు కానుంది. 2025 జనవరి నుంచి కొత్త ధరలు, కొన్ని బ్రాండ్లు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. గతంలో లేబుల్ రిజిస్ట్రేషన్లు తెలంగాణలో జరిగాయి. ఈ దఫా ఏపిలోనే ఉంటుంది. డిసెంబరులో ఈ ప్రక్రియను ప్రభుత్వం నిర్వహించనుంది. లేబుల్ రిజిస్ట్రేషన్ జరిగే వరకూ పాత ధరలే అనే మెలికను కూటమి ప్రభుత్వం పెట్టింది. గత ప్రభుత్వంలోని వైన్ ధరలే రూ.120కు (వాస్తవానికి ఇది రూ.99 అన్నారు) అమ్మకాలు జరుగుతున్నాయి. ఐతే ఊరట నిచ్చే విషయం ఏంటంటే గతంలో క్యాష్ మాత్రమే ఇవ్వాల్సి వచ్చేది. తాజాగా ఈ ప్రభుత్వంలో డిజిటల్ పేమెంట్లకూ అవకాశం ఇవ్వడం పట్ల మందుబాబులు సంతోషిస్తున్నారు.

ప్రివిలైజ్డ్ టాక్స్ పేర 'మందు బాబులకు వడ్డన...

రాష్ట్ర ప్రభుత్వం ప్రివిలైజ్డ్ టాక్స్ పేరుతో మందు బాబుల జేబులకు చిల్లులు పెట్టేందుకు సిద్ధమైంది. కేవలం రౌండ్ ఫిగర్‌లతో మరో మూడు నెలలు ధరలు పెంచేసి మద్యం విక్రయాలకు షాపులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసినట్టే అయింది. జనాల వద్ద ఎంత లాగగలిగితే అంత 2025 జనవరి వరకూ అన్న మాట షాపులలో వినిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో షాపులు అన్నిచోట్లా కనిపించేవి కానీ బ్రాండ్లు దొరికేవి కావు. ప్రభుత్వంలోనే షాపులుండడంతో వైసిపికి చెందిన నాయకులు, కార్యకర్తలకు పెద్దగా ఒరిగిందేమీ లేదు. దీంతో ఆ ప్రభుత్వంపై మందుబాబులు, సొంత పార్టీ వారూ తొలినుంచీ గుర్రుగా ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా 'షాపుల దందా, బ్రాండ్ల పేర దగా'కు టిడిపి సర్కారు తెర తీసింది. జనవరి నుంచి కొత్త బ్రాండ్లు వచ్చాక ఇంకెలా ఉంటుందో చూడాల్సిందే.

నగరం జలమయం : పలు రోడ్లు ధ్వంసం



రహదారిపై ప్రవహిస్తున్న నీరు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరంలో అనేక రోడ్లు జలమయం అయ్యాయి. పోర్టు సమీపంలోని హార్బర్ స్టేషన్ రోడ్డు జలమయమైంది. రామకృష్ణ జంక్షన్, 75 అడుగుల రోడ్డు, జనతా బజార్ రోడ్డు, బౌదారా రోడ్డు, వెలంపేట రోడ్డు జల ప్రవాహంతో రాకపోకలకు తీవ్ర అవరోధంగా మారాయి. దక్షిణ నియోజకవర్గంలోని పూర్ణా మార్కెట్, చుట్టుపక్కల ఉన్న రోడ్లు, జండా చెట్టు రోడ్డు, 75 అడుగుల రోడ్డు, ఫిషింగ్ హార్బర్ రోడ్డు పెద్దపెద్ద గోతులు ఏర్పడి ధ్వంసం అయ్యాయి. దీంతో వాహనాల చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొన్నిచోట్ల మ్యాన్ హోల్స్ గుండా మురుగునీరు రోడ్లపై ప్రవహించి, తీవ్ర దుర్వాసన కలిగించింది.

గుండెపోటుతో శ్రీనివాసరావు మృతి



ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సర్వ శిక్షా అభియాన్ పిఒగా విశాఖలో పనిచేసిన బి.శ్రీనివాసరావు (57) బుధవారం రాజమండ్రిలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని రాజమండ్రి నుంచి విశాఖ జిల్లా గాజువాక మండలం కూర్మన్నపాలెంలోని స్వగృహానికి గురువారం తీసుకొచ్చారు. విశాఖ జిల్లాలో రెండున్నరేళ్ల పాటు సమగ్ర సర్వ శిక్షా అభియాన్ ప్రాజెక్టు అధికారిగా పనిచేసిన శ్రీనివాసరావు ఇటీవల జరిగిన బదిలీలలో పంచాయతీరాజ్ శాఖకు వెళ్లారు. ప్రస్తుతం రాజమండ్రి జిల్లా పంచాయతీ అధికారిగా పని చేస్తున్నారు. ఆయన 2000 సంవత్సరంలో అనకాపల్లి ఎండిఒగా పనిచేసి మన్ననలు అందుకున్నారు.

గద్దర్ సభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : గద్దర్ సభ గోడ పత్రికను ఆంధ్ర యూనివర్సిటీ రంజని గెస్ట్ హౌస్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నేత ప్రసాద్ మాట్లాడుతూ, గరీబోళ్ల కన్నీటి వెతలను కళ్లకు కట్టినట్లు తన పాటలతో చూపించిన గొప్ప ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ అని అన్నారు. ఈనెల 20న జరిగే గద్దర్ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అప్పలరాజు, పాటల తూట ఉదయ భాస్కర్, ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ, పర్యావరణ కళామండలి జిల్లా కార్యదర్శి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు పట్టించుకోరా : అంధుడి ఆవేదన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తాను అంధుడినని తెలిసి పెళ్లి చేసుకొని ఇప్పుడు తనను ఆమె వేధిస్తోందని హెచ్‌బి.కాలనీకి చెందిన సారెళ్ల శ్రీధర్ (42) ఆవేదన వ్యక్తంచేశారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తాను కుటుంబంతో కలిసి హెచ్‌బి కాలనీలో ఉంటున్నానని తెలిపారు. పుట్టుకతోనే అంధుడినని, 2006 డిసెంబర్ 28న కొత్తవలసకు చెందిన ఏడువాక దేముడు కుమార్తె వెంకట ధనలక్ష్మిని పెళ్లి చేసుకున్నానని తెలిపారు. కొంత కాలం పాటు సాఫీగానే సంసారం సాగిందని, తర్వాత నుంచి ఆమె కుటుంబ సభ్యులు తన ఉద్యోగం, ఆస్తిని చూసి పక్కా ప్రణాళికతో మోసం చేయాలని చూస్తున్నట్లు ఆరోపించారు. తనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి వైకల్యం పేరుతో అన్ని విధాలా వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తానెదుర్కొంటున్న ఇబ్బందులపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్లకు వెళ్తే ఫిర్యాదును తీసుకోకవడం లేదని వాపోయారు. అంధుడిననే విషయాన్ని కూడా పట్టించుకోకుండా మరోసారి స్టేషన్‌కు వస్తే ఇబ్బందులెదుర్కోవాల్సి వస్తుందని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తానెక్కడికి వెళ్తున్నా న్యాయం జరగడం లేదని, అందుకే మీడియా ముందుకొచ్చానని చెప్పుకొచ్చారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, తనకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులతో కలిసి మీడియా ఎదుట తన గోడు చెప్పుకున్నారు.

అధిక ధరలపై సిపిఐ అర్ధనగ్న ప్రదర్శన



రైతుబజార్ వద్ద సిపిఐ శ్రేణుల ఆందోళన

ప్రజాశక్తి –గోపాలపట్నం : పెరుగుతున్న నిత్యావసరాల ధరలను అదుపుచేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక రైతుబజారు వద్ద అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా నేతలు ఆర్.శ్రీను మాట్లాడుతూ, ధరల నియంత్రణ, దళారి వ్యవస్థ నిర్మూలనలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి వైఫల్యం చెందాయని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, ధరాభారంతో సామాన్యుల జీవనాన్ని దుర్భరం చేస్తున్నారని ఆరోపించారు. సిపిఐ జిల్లా నాయకుడు ఆర్.రాంబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వానికి మద్యం ధరలను తగ్గించడంలో ఉన్న ఆసక్తి, కాయగూరలు, ఇతర నిత్యావసరాలపై ఎందుకు లేదని ప్రశ్నించారు.అస్తవ్యస్త ఇసుక పాలసీతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికుల ఉపాధి కోల్పోగా, ప్రస్తుత ధరల భారంతో కోట్లాది కుటుంబాలు సతమతవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరాభారం, ప్రభుత్వాల వైఫల్యాలపై ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు అన్నపూర్ణ, పెందుర్తి ఏరియా నాయకులు ఎన్. అసిరినాయుడు, అరుణ, రాము, దుర్గారావు పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ ఎసిపిగా మధుసూధన్



ఎసిపి మధుసూధన్

ప్రజాశక్తి–సీతమ్మధార : జివిఎంసి మూడవ జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా సిహెచ్ మధుసూధనరావు గురువారం ఉద్యోగబాధ్యతలు స్వీకరించారు గతంలో ఇదే జోన్‌లో టిపిఎస్‌గాను, టిపిఒగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూధన్ మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ విభాగంలో అలసత్వం లేకుండా విధులు నిర్వర్తించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. భవన నిర్మాణదారులు అనుమతులు పొందిన ప్లాన్‌ప్రకారం నిర్మాణాలు చేపట్టాలన్నారు. మధుసూధన్‌కు టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

విలేకరికి జియ్యాని పరామర్శ

ప్రజాశక్తి– కరాస: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ, నగరంలోని ఇండస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక దినపత్రిక విలేకరి రమణను నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారం పరామర్శించారు. రమణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఆరేళ్లుగా అంధకారంలోనే...

- విద్యుత్, మౌలిక వసతులకు నోచుకోని ఎన్‌టిఆర్ కాలనీ
- పట్టించుకోని వైసిపి ప్రభుత్వం .. కూటమి ప్రభుత్వ స్పందనకు ఎదురుచూపు



ఆరేళ్లుగా నిరాదరణకు గురైన ఎన్‌టిఆర్ కాలనీ

ప్రజాశక్తి–ఆనందపురం: ఆనందపురం పంచాయతీలోని ఎన్‌టిఆర్ కాలనీ ఆరేళ్లుగా అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. 2018లో నాటి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 83 మందికి ఎన్‌టిఆర్ కాలనీలో ఇంటిస్థలాలు మంజూరు చేయగా,కొంతమంది అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అనంతరం వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎన్‌టిఆర్ పేరుతో ఉన్న కాలనీ కావడంతో పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. కాలనీలో విద్యుత్‌తోపాటు ఇతర మౌలిక వసతులేవీ ఇన్నేళ్లయినా కల్పించిన పాపాన పోలేదు. దీంతో కాలనీవాసులు అంధకారంలోనే మగ్గుతూ ఆరేళ్లుగా కాలం వెల్లదీస్తున్నారు.

దీనిపై గడచిన వైసిపి ప్రభుత్వ హయాంలోపలుమార్లు అధికారులు, నేతలకు మొరపెట్టుకున్నా ఏ ఒక్కరూ కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు తమ కాలనీకి ఎన్‌టిఆర్ పేరు పెట్టడం వల్లే ఇంతా జరిగిందని గత ప్రభుత్వహయాంలో బాహాటంగానే చెప్పారని కాలనీవాసులు అంటున్నారు.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అయినా ఎన్‌టిఆర్ కాలనీలో సమస్యలు, అక్కడి ప్రజలకష్టాలపై దృష్టి సారించాలని వేడుకుంటున్నారు. తక్షణమే విద్యుత్‌సౌకర్యం కల్పించడంతోపాటు తాగునీరు, రోడ్లు, ఇతర సదుపాయాలను కల్పించాలని వేడుకుంటున్నారు. ఈ మేరకు 83 మంది కాలనీవాసులు ఇటీవల భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వినతి పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే గంటా చొరవ తీసుకుని, తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, సౌకర్యాలను కల్పిస్తారని వీరంతా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నోటి కేన్సర్‌కు అరుదైన ఆపరేషన్

ప్రజాశక్తి– మధురవాడ :నోటి కేన్సర్ బాధితునికి గీతం దంత వైద్యకళాశాల ఆసుపత్రి, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) వైద్య నిపుణుల బృందం విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించింది. వాల్తేర్‌కు చెందిన బి.రామారావు నాలుక వెనకభాగంలో నెల రోజులుగా తీవ్రమైన నొప్పితో బాధపడుతూ గీతం ఆసుపత్రిలో చేరారు. వైద్య పరీక్షలలో నోటి అల్సర్‌ను గుర్తించిన వైద్యనిపుణుల బృందం, నమూనాలను సేకరించి, బయాప్సీకి పంపగా నోటి కేన్సర్‌గా నిర్ధారణ అయ్యింది. నాలుకపై కేన్సర్ ప్రభావిత ప్రాంతాన్ని ఆపరేషన్‌చేసి తొలగించాలని నిర్ణయించిన వైద్యనిపుణుల బృందం, జిమ్‌సర్ ఇఎన్‌టి వైద్యులు డాక్టర్ యుగంధర్, గీతం దంత కళాశా ఓరల్ అండ్ మాక్సియో ఫేషియల్ సర్జరీ స్పెషలిస్ట్ డాక్టర్ రూపా గంట, డాక్టర్ సతీష్, డాక్టర్ సౌజన్య, విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించి, కేన్సర్ ప్రభావిత ప్రాంతాన్ని తొలగించారు. అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన వైద్యబృందాన్ని జిమ్‌సర్ ప్రో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.గీతాంజలి అభినందించారు.

ఈ సందర్భంగా వైద్యనిపుణులు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు ముఖ్యంగా సిగరెట్, బీడీ, చుట్టలతో పాటు గుట్కా, ఖైనీ, జర్దా వినియోగించే వారిలో నోటి కేన్సర్ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. నోటి కేన్సర్‌పై అవగాహనకు, రోగులకు ఉచిత కౌన్సిలింగ్ ఇవ్వడానికి గీతం దంత వైద్యకళాశాల ఆసుపత్రిలో ప్రత్యేక విభాగాన్ని నిర్వహిస్తున్నామని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి –భీమునిపట్నం : స్థానిక పాలిటెక్నిక్ కళాశాల 11 కెవి ఫీడర్ పరిధిలో విద్యుత్ నిర్వహణ, మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 18న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జివిఎంసి 3, 4 వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎపి ఇపిడిసిఎల్ జోన్ 3, ఆపరేషన్స్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా వార్డుల పరిధిలోని నేరెళ్లవలస, ఎగువపేట, బోయివీధి, ఎస్‌ఎఎస్, జెవి అగ్రహారం, నిడిగట్టు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

18 కిలోల గంజాయి స్వాధీనం : ఒకరు అరెస్ట్

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫాంపై జిఆర్‌పి ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యాన ముమ్మర తనిఖీలు చేపట్టారు. కర్ణాటక రాష్ట్రం ధార్వాడ్ జిల్లాకు చెందిన బరమప్ప బసవరాజ్ విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీకి అక్రమంగా తరలిస్తున్న 18 కిలోల గంజాయిని పట్టుకున్నారు. అతనిని అదుపులోకి తీసుకొని రైల్వే సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కె.అబ్దుల్ మహరూఫ్ కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా సిహెచ్ ధనుంజయనాయుడు మీడియాతో మాట్లాడుతూ, మాదకద్రవ్యాల స్మగ్లింగ్ ముఠాలను నివారించడంలో భాగంగా విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీస్, ఆర్‌పిఎఫ్ పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక టీముల సహాయంతో నిఘా వర్గాలను ఏర్పాటు చేసి విశాఖపట్నం, దువ్వాడ, అనకాపల్లి, సింహాచలం రైల్వేస్టేషన్లో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

రెండు దేవాలయాల్లో చోరీ

ప్రజాశక్తి –పద్మనాభం : మండలంలోని పెంట. కొవ్వాడ గ్రామాల్లోని రెండు ఆలయాల్లో చోరీ జరిగింది. గురువారం తెల్లవారుజామున నాలుగు గంటలకు గుర్తు తెలియని వ్యక్తులు ఆయా దేవాలయాల్లోకి చొరబడి. హుండీలను పగలగొట్టి, భక్తులు కానుకలుగా వేసిన నగదు దొంగలించారు.

దోమల నివారణి తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి –భీమునిపట్నం : మండలంలోని ఆర్ తాళ్లవలస ఎస్‌సి కాలనీకి చెందిన జి ఈశ్వరరావు (42) దోమల నివారణ మందు తాగి ఈ నెల 16న ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యం తాగే అలవాటున్న ఈశ్వరరావును ఆయన భార్య రమాదేవి మందలించింది.దీంతో మనస్తాపానికి గురైన ఈశ్వరరావు ఆత్మహత్యకు యత్నించగా, విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఈశ్వరరావు పంచాయతీ కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్.గౌరి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు గాయత్రి, తరుణ్ ఉన్నారు.

పి.కొవ్వాడ రేషన్ డీలర్ మృతి

ప్రజాశక్తి –పద్మనాభం : మండలంలోని పి కొవ్వాడ . రేషన్‌డిపో డీలర్ పి బంగారు శెట్టి. గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. 1988 నుంచి రేషన్‌డిపో డీలర్‌గా పనిచేస్తున్నారు. ఆయన అంత్యక్రియలు స్వగ్రామంలోనే నిర్వహించారు. బంగారుశెట్టి మృతిపై మండల రేషన్‌డిపో డీలర్ల సంఘం అధ్యక్షులు సత్తిబాబు, జిల్లాఉపాధ్యక్షులు బి రమేష్, పలు గ్రామాల డీలర్లు బంగారు నాయుడు, సత్యనారాయణ, లక్ష్మి, రామ్‌నాయుడు తదితరులు అంత్యక్రియల్లో పాల్గొని, సంతాపం తెలిపారు.

కుల వివక్షతపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి –భీమునిపట్నం : మధురవాడ శిల్పారామంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దళిత మహిళ పట్ల లైంగిక వేధింపులు, కులవివక్షకు పాల్పడుతున్న ఎఒపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు భాగం గోపాలరావు, డిమాండ్ చేశారు.గురువారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతూ, దీనిపై జిల్లాకలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. బాధిత మహిళకు రక్షణ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మాల మహానాడు జిల్లా కన్వీనర్ శివ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి–ఆనందపురం: మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మాజీ ఎమ్మెల్సీ గాది శ్రీనివాస్ నాయుడు గురువారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.కార్యక్రమంలో జిల్లా నాయకులు మడ్డు శ్రీనివాస్, గోవిందు, మండల నాయకులు త్రినాథ్, శంకరావు, ఆనందపురం హెచ్‌ఎం కె.రామకృష్ణ పట్నాయక్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

ప్రజాశక్తి– పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు సుజాతనగర్‌కు చెందిన బలివాడ కృష్ణప్రియ, శ్రీనివాసరావు, యశ్వంత్ కుటుంబ సభ్యులు గురువారం పెందుర్తి శాఖా గ్రంథాలయానికి పలు పుస్తకాలను వితరణగా అందజేశారు. నవలలు సాహిత్యం, పోటీ పరీక్షలకు సంబంధించిన వివిధ పుస్తకాలను స్థానిక లైబ్రేరియన్ సూర్యకళకు అందజేశారు. విద్యార్థులు, నిరుద్యోగులు, ఇతర పాఠకులకు ఉపయోగపడతాయనే ఉద్దేశ్యంతోనే పుస్తకాలను అందజేశామని, వాటిని సద్వినియోగ పరచాలని వారు కోరారు.

ఘనంగా వాల్మీకి జయంతి



అనకాపల్లిలో నివాళులర్పిస్తున్న ఎస్‌పి దేవప్రసాద్

ప్రజాశక్తి – యంత్రాంగం

మహర్షి వాల్మీకి జయంతిని పలుచోట్ల గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విశాఖ కలెక్టరేట్ : విశాఖ కలెక్టరేట్‌లో వాల్మీకి మహర్షి చిత్రపటానికి కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వాల్మీకి మహర్షి కవి మాత్రమే కాదని, ఒక మహానుభావుడని, జీవితం గురించి లోతైన అవగాహన కలిగిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ వి.మోహన్ కుమార్ పాల్గొన్నారు.

జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి జెడ్‌పి సిఇఒ పి.నారాయణమూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎంవిపి కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సర్వీపట్నం టౌన్: స్థానిక ఐదు రోడ్ల జంక్షన్లోని శాఖా గ్రంథాలయంలో వాల్మీకి మహర్షి జయంతిని గ్రంథాలయధికారిణి దమయంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పి. ప్రభాకర్ మాట్లాడుతూ, రామాయణ గ్రంథం రాసిన వాల్మీకి మహర్షి సీతారాముల గొప్పతనాన్ని ప్రపంచానికి పరిచయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో యువతీ యువకులు, పాఠకులు పాల్గొన్నారు.

అనకాపల్లి :మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ విజయక్రిష్ణన్, జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి వాల్మీకి చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ సాధనతో దేనినైనా సాధించవచ్చనడానికి వాల్మీకి జీవితం ఒక ఉదాహరణ అన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ బి.దయానిధి, ఎస్‌డిసి సుబ్బలక్ష్మి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కె.రాజేశ్వరి పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో గురువారం వాల్మీకి మహర్షి చిత్రపటానికి జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే మధుర కావ్యం రామాయణమని చెప్పారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు ఎస్.బాల సూర్యారావు, ఎస్.రమేష్, ఎస్సై బి.సురేష్ బాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జోరువానలోనూ సినర్జీస్ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి -గాజువాక : వేతన బకాయి చెల్లింపు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన సినర్జీస్ కార్మికులు చేపడుతున్న ఆందోళన గురువారం రెండోరోజున కొనసాగింది. పెద్దఎత్తున పోలీసు బలగాలను మోహరించినప్పటికీ, జోరున కురుస్తున్న వర్షంలోనూ ఆందోళన కొనసాగించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కార్మికులు భారీ ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆందోళన చేస్తున్న కార్మికులను వారించే ప్రయత్నం పోలీసులు చేయగా, కార్మికుల ఆకలి కేకలు పట్టని యాజమాన్యం తరపున వచ్చారా అని కార్మికులు ప్రశ్నించడంతో వారు మౌనం దాల్చక తప్పలేదు.



ఆందోళనలో మాట్లాడుతున్న సిఐటియు నేత రాంబాబు

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం రాంబాబు మాట్లాడుతూ, ఆరు నెలలుగా 950 మంది కార్మికులకు జీతాలు చెల్లించకపోతే, వారి కుటుంబాల జీవనం ఎలా సాగుతుందని ప్రశ్నించారు. ఇఎస్‌ఐ, పిఎఫ్ బకాయిలను కూడా యాజమాన్యం చెల్లించడం లేదని వాపోయారు. నెలసరి వేతనాలు రాకపోవడంతో ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు, ఇతర అవసరాలకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నా యాజమాన్యానికి పట్టకపోవడం దారుణమన్నారు. యాజమాన్యం ప్రతినిధి వచ్చి, ఒకనెల వేతనం చెల్లిస్తామని చెప్పగా, కార్మికులు ససేమిరా అంగీకరించలేదు. తక్షణమే మూడునెలల వేతన బకాయి చెల్లించాలని, మిగతా మొత్తాన్ని నెలాఖరులోగా క్లియర్ చేయాలని కార్మికులు పట్టుబట్టారు. యాజమాన్యం స్పందించకుంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులో జరిగే పరిణామాలకు యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు..



మాట్లాడుతున్న ఎస్‌వి రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : నిర్దిష్ట లక్ష్యంతో కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ద్వారకా క్రైం ఎస్ఐ ఎస్.రాజు సూచించారు. గురువారం సీతమ్మధారలోని ఎస్‌సి, ఎస్‌టి హాస్టల్‌లోని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హాస్టల్ అనేది అక్షర దేవాలయమని, ఇందులో వసతి పొందుతూ చదువుకునే విద్యార్థులు తమ లక్ష్యాన్ని మరిచిపోరాదని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని సూచించారు. తానూ ఒక హాస్టల్ విద్యార్థినేనని, కష్టపడి చదివి ఈ స్థాయికి చేరుకోవడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్స్, ధూమపానం వంటి చెడువ్యసనాల జోలికి పోరాదని, ఉన్నతస్థితికి చేరుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు, తాము చదువుకున్న హాస్టల్, పాఠశాలలకు మంచి పేరు తెచ్చిపెట్టాలని సూచించారు,. కార్యక్రమంలో ఎఎస్‌ఐ సత్యనారాయణ, వార్డెన్ ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్త అర్జునరావు మృతి



పంపాన అర్జునరావు

ప్రజాశక్తి -గాజువాక : స్థానిక పారిశ్రామికవేత్త పంపాన అర్జునరావు గురువారం బెంగళూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందాడు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న అర్జునరావు, బెంగళూరులో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృత్యువాత పడ్డారని కుటుంబసభ్యులు తెలిపారు. అర్జునరావు ఒక విద్యావ్యేత్తే కాకుండా గాయత్రి ఫ్యాబికేషన్, లక్ష్మీ ప్రభ ఇండస్ట్రీ ఫౌండర్ ఒక వ్యాపారవేత్తగా కూడా సమాజంలో మంచి గుర్తింపు పొందారు. ఈయన అంత్యక్రియలు శనివారం జరగనున్నట్లు బంధువులు తెలిపారు..

వరద బాధితులకు ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఫాస్టర్స్ ఫెలోషిప్

ప్రజాశక్తి- ఆనందపురం : విజయవాడ వరద బాధితులకు విశాఖపట్నం పెంథికోస్టల్ ఫాస్టర్స్ ఫెలోషిప్ ఆర్థిక సాయం అందజేసింది. మండలంలోని న్యూలైఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల డైరెక్టర్ డాక్టర్‌శ్యామ్ మాథ్యూస్ ఆధ్వర్యంలో విజయవాడలోని ప్రకాష్‌నగర్, సింగ్‌నగర్, కండ్రిక, రాజీవ్‌నగర్, యనమలకుదురు, శ్రీనగర్, రామలింగేశ్వరనగర్, కృష్ణలంక, వాంబేకాలనీ తదితర ప్రాంతాల్లో చర్చిలు, ఇళ్లు మునిగి తీవ్రంగా నష్టపోయిన 50 బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.మూడు వేలు చొప్పున రూ. 1.50లక్షల ఆర్థికసాయాన్ని అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. బాధిత కుటుంబాలకు భోజనాన్ని ఏర్పాటు చేశారు. కాగా పెంథికోస్టల్ ఫాస్టర్స్ ఫెలోషిప్ గత 15ఏళ్లగా విశాఖతోపాటు ఉత్తరాంధ్రలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. కార్యక్రమంలో టిటి జోసెఫ్, సిమన్ పవన్, ఈసక్ బాబు, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై వినతి



ఎమ్మెల్యే పల్లాకు వినతిపత్రం ఇస్తున్న స్టీల్ కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి -ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడుపల్లా శ్రీనివాసరావుకు గురువారం అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నేతలు విన్నవించారు. గాజువాకలోని ఎమ్మెల్యే కార్యాలయంలో పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఉక్కు కాంట్రాక్టు కార్మికులకు రెండు నుంచి ఆరు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, టెండర్ల ప్రక్రియ పూర్తికానందున సుమారు ఆరు వందల మంది కార్మికులు పనులు కోల్పోయారని ఆవేదన వెలిబుచ్చారు. ఉక్కు యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి తొలగించాలని చూస్తోందని, కొత్త టెండర్లలో అంచనాలను తగ్గించి కార్మికులకు ఉద్వాసన పలకాలని చూస్తున్నారని విన్నవించారు.
దీనిపై ఎమ్మెల్యే పల్లా స్పందిస్తూ, స్టీల్‌ప్లాంట్ లో కొన్ని సమస్యలు ఉన్నాయని, ప్లాంట్ నిలదొక్కు కోవటానికి కొంత సమయం పడుతుందన్నారు. కార్మికుల సమస్యలను ఉక్కు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నమ్మి రమణ, జి శ్రీనివాస రావు, చట్టి నర్సింగరావు, మంత్రి రవి. రామిరెడ్డి, గొడ్డి రమణ, కె వంశీ, అట్టా శ్రీను, పి పెంటారావు పాల్గొన్నారు

సెంచరీ మ్యాట్రిసెస్ స్టోర్ ప్రారంభం



స్టోర్‌ను ప్రారంభిస్తున్న ఎంపి శ్రీభరత్

ప్రజాశక్తి-సీతమ్మధార :స్థానిక రేసపువానిపాలెంలో సెంచరి మ్యాట్రిసెస్ ఎక్స్‌పీరియన్స్ స్టోర్, అగర్వాల్ కంఫర్ట్స్ స్టోర్‌ను విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉత్తమ్ మలానీ మాట్లాడుతూ, నూతన స్టోర్ ప్రారంభోత్సవం సందర్భంగా అన్ని రకాల పరుపులపై 15శాతం తగ్గింపు ఇస్తున్నామని, అలాగే రూ.15వేల వరకు ఉచిత బహుమతులను అందజేస్తామన్నారు. సామాన్యుల నుంచి అత్యంత విలాసవంతమైన వారి కోసం కూడా అవసరమైన పరుపులు తమ విశాలమైన స్టోర్‌లోఒకేచోట లభిస్తాయన్నారు. మంచి పరుపుఎంపిక ఎంతో కష్టమని, తమ వెబ్‌సైట్ ద్వారా ఇది సులభతరమౌతుందన్నారు. ఖాతాదారులకు మంచి అనుభూతిని కలిగించడంతోపాటు వారిసుఖనిద్రకు అవసరమైన నాణ్యమైన ఉత్పత్తులను తమ స్టోర్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. అగర్వాల్ హోమ్ కంఫర్ట్స్ వ్యవస్థాపకులు రాజేష్ అగర్వాల్, వందనా అగర్వాల్ మాట్లాడుతూ, లగ్జరీ బ్రాండ్ సెంచరీ పరుపుల స్టోర్ వైజాగ్‌లో ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు.

రతన్‌టాటాకు కళా సేవాపీఠం నివాళి

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఇటీవల మృతి చెందిన పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు గోపాలపట్నం కళాసేవాపీఠం గురువారం ఘనంగా నివాళులర్పించింది. రతన్ టాటా చిత్రపటానికి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు పూలమాల వేసి నివాళ లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టాటా గ్రూప్ ఛైర్మన్‌గా ఉన్నతమైన విలువలు పాటించే మహోన్నతమైన పారిశ్రామికవేత్తను భారతదేశం కోల్పోయిందన్నారు. టాటా ఇండికా, టాటా నానో కార్లను ప్రవేశపెట్టి మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన గొప్ప దార్శనికడని కొనియాడారు. కరోనా సమయంలో రూ.1500 కోట్లను కేంద్ర ప్రభుత్వానికి విరాళంగా అందజేశారని, ముంబయి తాజ్‌హోటల్‌పై దాడి ఘటనలో తీవ్రవాదుల చేతిలో మృతి చెందిన టాటా ఉద్యోగుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగమిచ్చి ఆదుకున్న మానవతావాది రతన్ టాటా అని ప్రశంసించారు.కార్యక్రమంలో కళా పీఠం అధ్యక్షులు రామదాసు, మాజీ అధ్యక్షుడు చందు సుబ్బారావు, కార్యదర్శి నూకరాజేశ్వరరావు, సభ్యులు వల్లూరి జగదీష్, చంద్రశేఖర్, విశ్వేశ్వరరావు, టి. రామచంద్రరావు పాల్గొన్నారు.



టాటాకు నివాళులర్పిస్తున్న కళాపీఠం సభ్యులు

ఎమ్మెల్యే చొరవతో స్థానికులకు ఉద్యోగాలు



అపాయింట్‌మెంట్ లెటర్స్ ఇస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

ప్రజాశక్తి-పెందుర్తి: మండలం గుర్రంపాలెం పంచాయతీలో ఎపిఐఐసికి కేటాయించిన స్థలాలలో నెలకొల్పిన జొమాటో, రిలియన్స్ సంస్థల్లో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చొరవతో స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించారు. గురువారం ఆయాసంస్థల యాజమాన్యం ఆధ్వర్యంలో ఎంపికైన అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ లెటర్స్‌ను ఎమ్మెల్యే కార్యాలయంలో పంచకర్ల రమేష్‌బాబు అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగకల్పనకు చొరవ తీసుకున్న ఎమ్మెల్యే పంచకర్లకు నిరుద్యోగ యువత కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడుతూ, రానున్న రోజుల్లో మరింత మందికి ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేస్తానని భరోసానిచ్చారు.

హాస్టళ్లను ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పెందుర్తి: పులగాలిపాలెంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం, గిరిజన బాలుర హాస్టళ్లను గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ ఆకస్మికంగా తనిఖీ చేసారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటశేషమ్మ మాట్లాడుతూ అమరావతిలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు హాస్టళ్లను తనిఖీ చేశామని, ఇక్కడ గుర్తించిన సమస్యలను, ఇతర వివరాలను నివేదిస్తానన్నారు. కార్యక్రమంలో వార్డెన్లు సూర్యప్రకాశరావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న వెంకటశేషమ్మ

ఇంటి వద్దకే నేత్ర వైద్య సేవలు

ప్రజాశక్తి - ఆరిలోవ : వృద్ధులు, కదలలేని స్థితిలో ఉన్న కంటి రోగుల సమగ్ర నేత్ర సంరక్షణలో భాగంగా ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ, స్టాండర్డ్ ఛార్టర్డ్ భాగస్వామ్యంతో ఇంటి వద్దకే కంటి వైద్యసేవలను అందిస్తున్నట్లు సంస్థఎగ్జిక్యూటివ్ అధ్యక్షులు డాక్టర్ ప్రశాంత్ గర్గ్, స్టాండర్డ్ ఛార్టర్డ్ బ్యాంక్ సస్టైయినబిలిటీ అధిపతి కరుణా భాటియా తెలిపారు. 'సీయింగ్ ఈజ్ బి లివింగ్' కార్యక్రమంలో భాగంగా ఎల్‌విపిఇఐ@ హోం సేవల సంస్థకు ఒక ఫోన్‌కాల్ ద్వారా రిజిస్టర్ చేసుకుని ఇంటివద్దే వైద్యసేవలను పొందవచ్చన్నారు. శిక్షణ పొందిన ఒక విజన్ టెక్నీషియన్ లేదా ఆప్టోమెట్రిస్ట్ రోగి ఇంటిని సందర్శించి సమగ్ర కంటి పరీక్ష చేస్తారని, రోగ నిర్ధారణ, నిర్వాహణ ప్రణాళిక, ప్రిస్క్రిప్షన్, తరువాత



మొబైల్ నేత్ర వైద్యసహాయకుడు

సందర్శన వివరాలతో కూడిన వైద్య నివేదికను రోగి ఫోన్ నెంబరుకు పంపుతారన్నారు. అర్హులైన నిరుపేద వృద్ధులకు ఉచితంగా కళ్లద్దాలను కూడా అందిస్తామన్నారు. శస్త్రచికిత్స అవసరమైతే సమీపంలోని ఎల్‌విపిఇఐ.కేంద్రానికి వెంటనే తరలించి చేయిస్తారన్నారు.

జెడ్‌పి సిఇఒ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం జిల్లా పరిషత్ సిఇఒ పి.నారాయణమూర్తి సందర్శించారు. ఎంపిడిఒ ఎన్ హనుమంతరావు, ఇఒపిఆర్‌డి కనకల రమేష్ నాయుడు, సిబ్బంది స్వాగతం పలికారు. మండలంలోని మజ్జివలస, చిట్టి వలస జెడ్‌పి ఉన్నత పాఠశాలలను జెడ్‌పి సిఇఒ పి నారాయణమూర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు, మధ్యాహ్నభోజనం అమలు తీరును పరిశీలించారు. మరుగుదొడ్లను పరిశీలించి, రన్నింగ్ వాటర్ సదుపాయం ఉందా,లేదాయని ప్రశ్నించారు.

అభిజిత్ కార్మికులచే

తహశీల్దారు కార్యాలయం ముట్టడి

వర్షంలోనూ కొనసాగిన ఆందోళన



తహశీల్దారు కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేస్తున్న అభిజిత్ కార్మికులు

ప్రజాశక్తి అచ్యుతాపురం

అభిజిత్ ఫెర్రో టెక్ కంపెనీ యాజమాన్యం ప్రకటించిన లే ఆఫ్‌ను ఎత్తివేసి, కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దారు కార్యాలయాన్ని కార్మికులు ముట్టడించారు. నాలుగు రోజుల క్రితం కంపెనీ యాజమాన్యం లే ఆఫ్ ప్రకటించి మూసివేయగా, ఆ రోజు నుంచి పరిశ్రమ ప్రధాన గేటు వద్ద కార్మికులు ఆందోళన చేస్తున్న విషయం విధితమే. గురువారం వర్షం కురుస్తున్నా ఉదయం నుంచి గేటు వద్ద ఆందోళన కొనసాగించారు. అక్కడ నుంచి వర్షంలో తడుస్తూ, అచ్యుతాపురం పురవీధులలో నినాదాలు చేస్తూ ర్యాలీగా తహశీల్దారు కార్యాలయానికి చేరుకున్నారు. 'మా పొట్టలు కొట్టవద్దు', 'మూసివేసిన పరిశ్రమను తిరిగి ప్రారంభించాలి', ఉపాధి కోల్పోయిన వెయ్యి మంది కార్మికులకు న్యాయం చేయాలి' వంటి నినాదాలతో తహశీల్దారు కార్యాలయం ఆవరణ దద్దరిల్లింది. ప్రభుత్వం వెంటనే స్పందించి పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి పరిశ్రమను పున:ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, మండల కన్వీనర్ కె.సోమునాయుడు మాట్లాడుతూ కార్మికులతో కనీసం సంప్రదించకుండా విధులకు హాజరైన కార్మికులను పరిశ్రమలోకి రానివ్వకుండా అక్రమంగా నోటీసు అతికించి అన్యాయంగా పరిశ్రమను మూసివేశారని తెలిపారు. నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వంగానీ యాజమాన్యం గాని పట్టించుకోలేదన్నారు. కార్మిక చట్టాలను అమలు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు దశలవారీగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

యడ్లగెడ్డ కాలువపై మినీ బ్రిడ్జి నిర్మించాలి

ప్రజాశక్తి - యలమంచిలి

తురంగలపాలెం వెళ్లే దారిలో యడ్లగెడ్డపై నిర్మించిన రోడ్డు కుంగిపోయిందని, దానిపై యుద్ధప్రాతిపదికన మినీ బ్రిడ్జి నిర్మించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక రామారాయుడు పాలెం, తురంగల పాలెం ప్రజలతో కలిసి గురువారం వారు యడ్లగెడ్డ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ మొక్కు బడిగా మున్సిపాలిటీ వారు ఒక తూరవేసి రోడ్డు నిర్మించారని, అది కుంగిపోవండంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం జరుగుతోందని పేర్కొన్నారు. వర్షం నీరు ప్రవాహంలో ఆ తూరలో చిక్కుకొని వ్యక్తులు మరణించిన సందర్భాలున్నాయన్నారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం అక్కడ మినీ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ శివాజీ, మారిశెట్టి శంకర్, రామారాయుడు పాలెం, జంపపాలెం, తురంగలపాలెం యువకులు మణికంఠ, ధనుంజయ్‌లు పాలొన్నారు.



రోడ్డు కొట్టుకుపోయిన ప్రాంతంలో నినాదాలు చేస్తున్న దృశ్యం



ప్రకృతి వ్యవసాయంపై ముద్రించిన పుస్తకాన్ని విడుదల కలెక్టర్ విజయకృష్ణన్, ఇతర అధికారులు

వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

వ్యవసాయ అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ ఆదేశించారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం వ్యవసాయ శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పొలంబడి, పొలం పిలుస్తోంది, పిఎం.కిసాన్, ప్రకృతి వ్యవసాయం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ రైతులకు కావలసిన సమాచారం, సహాయం వెంటనే అందించాలన్నారు. వ్యవసాయ ప్రయోగాలు వలన ఉపయోగాలను రైతులకు తెలియజేయాలని తెలిపారు. రైతుల రిజిస్ట్రేషను, ఇకెవైసీ నూరు శాతం పూర్తిచేయాలని సూచించారు. నూతన సాగు పద్ధతులపై అవగాహన, ఆసక్తి కల్పించాలన్నారు. వరి పంట మినహా మిగిలిన పంటల లక్ష్యాలు పూర్తికావడం లేదని, పప్పుధాన్యాలు, సిరిధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రబీ పంటకు కావలసిన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. రసాయన ఎరువులు వాడకం తగ్గించాలని, ప్రకృతి వ్యవసాయంపై ప్రచారం కల్పించాలని, ఆయా ఉత్పత్తులకు మార్కెటింగు కల్పించాలని ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయంపై సమాచారం అందించే పుస్తకాన్ని విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బి. మోహనరావు, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రోజెక్టు మేనేజరు సిహెచ్.లచ్చన్న, వ్యవసాయశాఖ ఎడిఎ, మండల ఎఒలు పాల్గొన్నారు.

సారగ్ సిమెంట్ ట్రాన్స్‌పోర్టు

డ్రైవర్ల సమ్మె విజయవంతం



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-కశింకోట

కసింకోట మండలంలో బయ్యవరం గ్రామం వద్దవున్న సాగర్ సిమెంట్ కంపెనీకి సంబంధించిన పార్థసారథి ట్రాన్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో పనిచేస్తున్న డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం లారీ డ్రైవర్ల సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన చేపట్టిన సమ్మె గురువారం విజయవంతమైంది. నాలుగు రోజులుగా లారీ డ్రైవర్లు సమ్మె చేస్తున్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో గురువారం పార్థసారథి ట్రాన్స్‌పోర్టు యాజమాన్య ప్రతినిధులు, డ్రైవర్ల సంఘం, సిఐటియు నాయకులు మధ్య జరిగిన చర్చలు ఫలించాయి. మూడు నెలల క్రితం ఏవైతే బెనిఫిట్స్‌ని తగ్గించారో వాటిని యథావిధిగా అమలు చేస్తామని, నెలకు రూ.2250 వేతనం పెంచడానికి, 2025 ఏప్రిల్ 1 నుండి మరో రూ.750 పెంచడానికి, కార్మికులపైఎటువంటి కక్ష సాధింపు చర్యలు చేపట్టబోమని రాతపూర్వకంగా పార్థసారథి ట్రాన్స్‌పోర్టు యాజమాన్య ప్రతినిధులు అంగీకరించారు. దీంతో డ్రైవర్లు తమ సమ్మెను విరమించి విధుల్లో చేరుతామని చెప్పారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ సాగర్ సిమెంట్ లారీ డ్రైవర్లకు ఏడు సంవత్సరాలుగా వేతనాలు పెంచలేదన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతుంటే ట్రాన్స్‌పోర్టు యాజమాన్యం జీతాలు, బెనిఫిట్స్ పెంచకపోగా ఇంకా తగ్గించిందని, అందువలన సమ్మె చేయవలసి వచ్చిందని పేర్కొన్నారు. డ్రైవర్ల న్యాయబద్ధ సమ్మెను విచ్ఛిన్నం చేయాలని సంస్థ ప్రతినిధులు అనేక విధాలుగా ప్రయత్నాలు చేసినప్పటికీ కార్మికుల ఐక్యంగా పోరాడి విజయం సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్థసారథి ట్రాన్స్‌పోర్టు యాజమాన్యం ప్రతినిధులు లక్ష్మారెడ్డి, కృష్ణ, సాగర్ సిమెంట్ కంపెనీ జిఎం, డ్రైవర్లు వి.గోవిందు, అప్పలనాయుడు ఎస్ఎస్.యాదవరాజు, సత్యనారాయణ, అర్జున్, సురేష్, 170 మంది డ్రైవర్లు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్‌రావు, నాయకులు దాకారపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించాలి

కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో ఉత్పత్తి అయ్యే వస్తువులకు బ్రాండింగ్ కల్పించి, ఎగుమతులు చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులను విలువ ఆధారత ఉత్పత్తులుగా మార్చి విక్రయించడం ద్వారా ఆదాయం పెంపొందించాలని సూచించారు. ఉద్యాన శాఖకు వంద రోజుల యాక్షన్ ప్లాన్ కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచాలని, రైతులకు కావలసిన సహాయ సహకారాలను అందించాలని కోరారు. రైతుల పండించిన పంటలకు మంచి ధర లభించేలా మార్కెటింగ్ సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆయిల్ ఫామ్ లక్ష్యం 245 హెక్టర్ ఇవ్వగా 335 హెక్టార్స్ పూర్తి చేసి 137 శాతం, బొప్పాయి, జామ, జీడి మొదలగు పంటల సాగు లక్ష్యం 100 హెక్టార్స్ కాగా 127.4 హెక్టర్స్ పూర్తి చేసి 127శాతం సాధించినట్లు అధికారులు జిల్లా కలెక్టర్‌కు తెలియజేశారు. ఈ సమావేశంలో ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

మోస్తరు వర్షం.. రైతుల హర్షం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : అల్పపీడనం ప్రభావంతో మండలంలోని పలు గ్రామాలలో గురువారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. కొద్దిరోజులుగా వర్షాలు పెద్దగా కురవకపోవడంతో వరి మడుల్లో నీరు లేక వరి రైతులు కాస్త ఆందోళన చెందారు. పలు గ్రామాల్లో వరి పంట పొట్ట దశలో ఉంది. దీంతో రైతులు పంట చేతికి వస్తుందా? రాదా? అంటూ దిగులు చెందారు. ఈ నేపథ్యంలో గురువారం వర్షం పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కల్లుగీత కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- కె.కోటపాడు : ఎపి కల్లుగీత కార్మిక సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక గురువారం ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘం మండలం అధ్యక్షులుగా శెట్టి రమణ, ఉపాధ్యక్షులుగా కండిపల్లి సహదేవుడు, కార్యదర్శిగా ఎం.కనకరాజు, సహాయ కార్యదర్శిగా జలం నాగరాజు, కోశాధికారిగా వనం భానుప్రసాద్, డైరెక్టర్‌గా కె వెంకటేష్, జలము రామనాయుడు, సుక్క పైడిరాజు, వనము వెంకట్రావు, కె.అప్పలరాజు, బ్రహ్మయ్య, పట్నాల రమేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు శెట్టి రమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం గీత కార్మికులకు ఎటువంటి లాటరీ లేకుండా 20శాతం బ్రాందీ షాపులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని గీత కార్మికులు పాల్గొన్నారు.

మొగలిపురంలో గౌరమ్మ ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మొగలిపురం గ్రామంలో కర్రి వారి గౌరమ్మ ఉత్సవ్ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో పౌర్ణమి గౌరమ్మ ఉత్సావాలు బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలలో వైసిపి పెందుర్తి నియోజకవర్గం నాయకులు గండి రవికుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మంగళ వాయిద్యాలు, బాణాసంచా, మహిళా కోలాటాలతో ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిరపరపు వాసు, ఐడి బాబు, దేముడు ఇతర నాయకులు పాల్గొన్నారు.

తాతయ్య బాబును కలిసిన ఆర్ఎంపి వైద్యులు

ప్రజాశక్తి-వడ్డాది : ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బత్తుల తాతయ్య బాబును ఆర్ఎంపీ వైద్యులు గురువారం వడ్డాదిలోని టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మెమోంటో, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆర్ఎంపి వైద్యుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పదిలం బెన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం విరాళం

ప్రజాశక్తి-అనకాపల్లి : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి పరవాడ ఎస్ఇజెడ్‌లో గల స్టైరెక్స్ ఫార్మా కంపెనీ రూ.2.50 లక్షలు చెక్కును గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయకృష్ణన్‌కు అందజేస్తారు. కంపెనీ మేనేజింగు డైరెక్టరు ఎస్.వెంకటేశ్వరరావు తరపున వైస్ ప్రెసిడెంటు ఎం.వెంకటరెడ్డి ఈ చెక్కును అందించారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోలు బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.ముకుందరావు పాల్గొన్నారు.

పాల సేకరణ ధర తగ్గించడంపై భగ్గుమన్న రైతులు

విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రం వద్ద నిరసన

ప్రజాశక్తి-కె.కోటపాడు

విశాఖ డెయిరీ యాజమాన్యం ఒక్కసారిగా పాల ధరను తగ్గించడంపై రైతులు భగ్గుమన్నారు. మండలంలోని చౌడువాడ గ్రామంలోని పాల సేకరణ కేంద్రం వద్ద గురువారం పాడి రైతులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. సొసైటీ సిబ్బంది పాలు సేకరణ చేయడానికి ప్రయత్నించగా రైతులందరూ అడ్డుకున్నారు. పాల కేంద్రం గేట్లును బిగించారు. పశు దాణా రేట్లు రోజురోజుకు పెంచుతున్న డెయిరీ యాజమాన్యం పాలు ధరలు పెంచాల్సి పోయి, ఉన్న ధరలను తగ్గించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వ్యవసాయం లాభసాటిగా లేకపోవడంతో పాడిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని తెలిపారు. గతంలో ఆవుపాలు వెన్నశాతాన్ని బట్టి లీటర్‌కు రూ.33.93 నుంచి రూ.44.05 వరకు చెల్లించగా, దానిని రూ.32.33 నుంచి రూ.40.86కు తగ్గించడం దారుణమన్నారు. రైతులకు గేదెలు కన్నా ఆవులు లాభచాటిగా ఉన్నాయని, ప్రతి గ్రామంలోనూ 90శాతం మంది ఆవులను మేపుతున్నారని, అలాంటి రైతులకు అన్యాయం చేయడం దారుణమన్నారు. రెండు సంవత్సరాలగా విశాఖ డెయిరీ నుంచి ఒక్క పైసా కూడా బోనన్స్ ఇవ్వకపోగా, పాల ధరలను తగ్గించడం ఏమిటని ప్రశ్నించారు. ఒక దశలో చైర్మన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. సొసైటీ ప్రెసిడెంట్ కుమార్ వెంకటరమణ (పీర్లెస్) రైతులకు సర్దిచెప్పడానికి ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో గంగాధర్ వచ్చి ధర తగ్గిన విషయంపై డెయిరీ యాజమాన్యంతో మాట్లాడి పాత ధర ఇచ్చే విధంగా తన వంతు ప్రయత్నం చేస్తానని, కొద్దిగా సమయం ఇవ్వాలని కోరారు. దానికి రైతులు సమ్మతించారు. అనంతరం డెయిరీ సిబ్బంది యథావిధిగా పాలను రైతుల నుంచి సేకరించారు. ఈ కార్యక్రమంలో పారి రైతులు, పాల సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.



చౌడువాడ పాల సేకరణ కేంద్రం వద్ద పాల క్యాన్లతో ఆందోళన చేస్తున్న పాడి రైతులు

పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై అవగాహన

ప్రజాశక్తి-కె.కోటపాడు

యువజన సర్వీసుల శాఖ- సెట్విస్ సంయుక్త ఆధ్వర్యంలో పర్సనాలిటీ డెవలప్మెంట్, కెరీర్ కౌన్సెలింగ్, యూత్ క్లబ్‌లపై గురువారం స్థానిక అయ్యన్న విద్యా సంస్థల్లో 8, 9, 10 తరగతులు, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న యూత్ సర్వీసెస్/సెట్విస్ రిసోర్స్ పర్సన్ ఎస్ఎ.బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అంశాలపై అవగాహన కల్పించుకుంటే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు పొందవచ్చని చెప్పారు. ప్రస్తుతం అనేక ఉద్యోగ అవకాశాలున్నాయని, నైపుణ్యంగల మానవవనరుల కొరత మాత్రం ఉందని తెలిపారు. ఉద్యోగానికి కావాల్సిన విద్యార్హతలున్నప్పటికీ ఇంటర్వ్యూలలో ఒత్తిడికి గురై సరైన కమ్యూనికేషన్ స్కిల్స్ లేక ఉద్యోగాలు పొందలేక పోతుంటారని చెప్పారు. కోర్సులు పూర్తయిన తరువాత వృత్తి నైపుణ్యం కోర్సులు కూడా నేర్చుకోవాలని సూచించారు. అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీం మాట్లాడుతూ యువత తమ అభిరుచులు, ఆసక్తులకు అనుగుణంగా కెరీర్‌ను నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బి.వివేక్, యువజన సర్వీసుల శాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

23న వాహనాల బహిరంగ వేలం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 23న అనకాపల్లి జిల్లా ఆర్టీవో కార్యాలయ పరిధిలో రవాణా శాఖ అధికారులు సీజ్ చేసిన వాహనాలను బహిరంగ వేలం వేయనున్నట్టు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీజ్ చేసిన వాహనాల యజమానులు, ఫైనాన్షియర్లు అపరాధ రుసుము, పన్ను బకాయి చెల్లించాలని, నోటీసులు అందజేసిన స్పందించని కారణంగా గూడ్స్ వాహనాలు, ఒక మ్యాక్సీ క్యాబ్ వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు అనకాపల్లి ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో జరిగే ఈ వేలంలో ఆసక్తి గలవారు పాల్గొనవచ్చన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి నుండి తుమ్మపాల మీదుగా చోడవరం వెళ్లే ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా ఉన్న గోతులను పూడ్చి రోడ్డు మరమ్మతు చేపట్టాలని బిఎస్‌పి అనకాపల్లి ఇంచార్జ్ సూదికొండ మాణిక్యాలరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి చోడవరం రోడ్డు గుండాలవీధిలో రోడ్డు మధ్యలో గల గోతులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ రహదారి మరమ్మతు చేపట్టకపోతే ప్రజా సంఘాలతో నిరసన చేపడతామని హెచ్చరించారు.

విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకాన్ని అర్హులైన చేతి కులవృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. అనకాపల్లి గుండాల జంక్షన్ శంకరన్ సమావేశ మందిరంలో జీవీఎంసీ యుసిడి డిపార్టుమెంటు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం లబ్ధిదారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, కూటమి నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కొణతాల భాస్కర్ రావు, నీలబాబు, కర్రి బాబి, రామచంద్రరావు, తాడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- సబ్బవరం : సబ్బవరం పిహెచ్‌సిని అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎంఎస్‌వికె బాలాజీ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పిహెచ్‌సిలో రికార్డులను, ఆరోగ్య కార్యక్రమాల రికార్డ్సను పరిశీలించారు. ఎంఎల్‌హెచ్‌పిలపై వచ్చిన అభియోగాలపై ఎంఎల్‌హెచ్‌పిల హాజరు పట్టికను, ఎఫ్ఆర్ఎస్ రికార్డ్సను తనిఖీ చేశారు. అనంతరం గొట్టివాడ విలేజ్ హెల్త్ క్లినిక్ సందర్శించి అక్కడి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చక్రవర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ బాలాజీ

'ఉల్లాస్' ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "ఉల్లాస్" కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ అన్నారు. ఉల్లాస్ కార్యక్రమంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ చాంబరులో జరిగింది. కలెక్టరు మాట్లాడుతూ ఉల్లాస్ పథకంపై జిల్లాకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు. 2024-25 సంవత్సరానికి 11,900 మందికి వయోజన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అక్ష్యరాస్యత శాతం తక్కువగా గల మండలాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. దీనిని విజయవంతం చేయుటకు పంచాయతీరాజ్, గ్రామ సచివాలయం, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమం, విద్యాశాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామాలలో అంగన్ వాడీ సెంటర్లను అక్షరాస్యతా కేంద్రాలుగా వినియోగించుకోవాలని కోరారు. స్వచ్ఛందంగా సేవలందించే టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో వయోజన విద్య ఉపసంచాలకులు వివిఎస్.సుబ్రహ్మణ్యవర్మ, సహాయ సంచాలకులు డి.చిన్నికృష్ణ, కమిటీ సభ్యులు జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి, డిఆర్డిఎ పిడి కె.శశిదేవి, డిఐపిఆర్ఒ కె.ఇంద్రావతి, శిశు సంక్షేమశాఖ పిడి కె.అనంతలక్ష్మి, జిల్లా గ్రామవార్డు సచివాలయ అధికారి ఎస్.మంజులవాణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్లపాలెం సెక్షన్, నరసింగబిల్లి సబ్ స్టేషన్స్ పరిధిలోని ఫీడర్స్ వర్క్, సబ్ స్టేషన్ మెయింటేనెన్స్ కారణంగా శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఈఈ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సింగ్‌బిల్లి, ఎన్‌జి.పాలెం, గొబ్బూరు, చింతలపాలెం, త్రిపురువానిపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినపాలెం, కొతపల్లి, ఏనుగుతుని, సోమవారం, చినఏనుగు తుని, గొల్లగుంట, జి.భీమవరం, అడ్డం, అచెర్ల, కొత్తఅచెర్ల, మాసయ్యపేట, గోకవానిపాలెం, బుచ్చియ్యపేట, గంటవానిపాలెం, జోగారావుపేట, పెరంటాలపాలెం, తాళ్లపాలెం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, కొత్తపల్లి, ఏఎస్.పేట గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు దీనికి సహకరించాలని కోరారు.

పాల సేకరణ ధర తగ్గించడం సరికాదు

ప్రజాశక్తి- అనకాపల్లి : విశాఖ డెయిరీకి ఆవు పాలు పోస్తున్న రైతులకు కొనుగోలు ధరలో లీటర్‌కు మూడు రూపాయలు కోత విధించడం దుర్మార్గమని సిపిఐ అనకాపల్లి ఏరియా కార్యదర్శి వైఎన్.భద్రం అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రైతులకు న్యాయం చేయకుంటే ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు కోరిబిల్లి శంకర్రావు, చెల్లూరు నాగరాజు, తాకాసి వెంకటేశ్వరరావు, శ్రీరామదాసు అబ్బులు, మత్తుర్తి సూరిబాబు పాల్గొన్నారు.

అవయవ దాతల సంఘం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వినోద్ బాలు

ప్రజాశక్తి-వడ్డాది

అవయవదాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉత్తరాంధ్ర రక్తదాన ప్రచారకర్త, వందేమాతరం బ్లడ్ బ్యాంక్ చైర్మన్ వినోద్ బాలు నియమితులయ్యారు. ఈ మేరకు సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ టేబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామాలక్ష్మి నియామక ఉత్తర్వులు అందజేశారు. వినోద్ బాలు దశాబ్ద కాలంగా రక్తదానంపై అవగాహనా సదస్సులు నిర్వహిస్తూ 1000 రక్తదాన శిబిరాలు నిర్వహించి 54 వేల యూనిట్లకు పైగా రక్తం సేకరించారు. గ్రామీణ ప్రాంతంలో రక్త దాన చైతన్య సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యం చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి అవయవ దాతలు సంఘం ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

గ్రామాల్లో 'పల్లె పండుగ'

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని పలు గ్రామాలలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులకు అనకాపల్లి శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ గురువారం శంకుస్థాపన చేశారు. చింతలపాలెంలో రూ.9లక్షలు, గొబ్బూరులో రూ.12లక్షలు ఎఎస్.పేటలో రూ.6 లక్షలు, సోమవరం గ్రామంలో రూ.8 లక్షలతో సిసి రోడ్లు నిర్మించనున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, కూటమి నాయకులు గొంతని శ్రీనివాసరావు, కర్రి వెంకట సత్యనారాయణ, కాయలు మురళి, కర్రి దుర్గ నాయడు, మండల పత్యేకాధికారి రోజారాణి, ఎంపిడిఓ రవి కుమార్ పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని గురువారం సిహెచ్ బి అగ్రహారం, న్యాయంపూడి, కాగిత, చందనాడ, డిఎల్ పురం గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. సిసి రోడ్లు, పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి సీతారామరాజు, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, పార్టీ నాయకులు కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి బుజ్జి, గింజాల లక్ష్మణరావు, మీగడ సత్తిబాబు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : మండలంలో చెట్టుపల్లిలో పల్లె పండుగలో భాగంగా రోడ్డు పనులకు శంకుస్థాపన చేపట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సుకల రమణమ్మ మాట్లాడుతూ, వీలైనంత త్వరగా గ్రామంలో మిగిలిన సిమెంట్ రోడ్లు పూర్తి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ ప్రెసిడెంట్ రంగస్వామి జనసేన రూరల్ ఉపాధ్యక్షుడు ఊడి చక్రవర్తి, ఎంపీడీవో ఉషశ్రీ, ఎంపీటీసీ అమ్మాజీ, పంచాయతీ సెక్రెటరీ శ్రావణి, సర్పంచ్ గజాల సూరిబాబు, విద్యా కమిటీ చైర్మన్ పచ్చికార ఈశ్వరరావు పాల్గొన్నారు.

కోటవురట్ల : గ్రామీణ ప్రాంతాలలో సమస్యలను పరిష్కరించేందుకే పల్లె పండగను నిర్వహిస్తున్నట్లు టిడిపి జిల్లా కార్యదర్శి లాలం కాశీనాయుడు తెలిపారు. గురువారం జల్లూరు, జగ్గంపేట పొందూరు, గొట్టువాడలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం గ్రామీణ సమస్యలను పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, పిఆర్ జెఈ వర్మ, ఏపీవో నాగరాజు పాల్గొన్నారు.

భీమునిపట్నం : గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు గురువారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దాకమర్రి,బోడమెట్టపాలెం, అమనాం పంచాయతీల్లో రూ.77లక్షల ఉపాధి నిధులతో రోడ్లు, కాలువ పనులకు శంకుస్థాపన చేశారు.ఎంపిడిఒ ఎన్ హనుమంతరావు, జెడ్‌పిటిసి గాడు వెంకట ప్పడు, టిడిపి మండల అధ్యక్షులు డిఎఎన్ రాజు, నాయకులు ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు

పద్మనాభం : మండలంలోని మద్దిగ్రామ పంచాయతీలో. రూ.15లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి గ్రామ సర్పంచ్ బి సన్యాసమ్మ. గురువారం శంకుస్థాపన చేశారు. రూ.11లక్షల ఉపాధి నిధులు, రూ.3.75లక్షల గ్రామపంచాయతీ నిధులతో పల్లెపండుగలో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో. మండల టిడిపి మాజీ అధ్యక్షులు కె.నగేష్ కుమార్, నాయకులు బి.సత్యనారాయణ,గిరి, శ్రీను, గ్రామ కార్యదర్శి వివిఎస్ బ్రహ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కోటవురట్ల మండలంలో శంకుస్థాపన చేస్తున్న నాయకులు

రెవెన్యూ గ్రామ సభలు ప్రారంభం



మాట్లాడుతున్న బుచ్చయ్యపేట తహశీల్దార్ లక్ష్మి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని మండల తహశీల్దార్ ఎం.లక్ష్మి తెలిపారు. మండలంలోని కరక గ్రామంలో గురువారం రెవెన్యూ గ్రామ సభ జరిగింది. గ్రామంలోని రైతుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దాకారపు నాగేశ్వరి దేవి, సర్పంచ్ సత్యారావు, ఆర్ఐ శ్రవణ్, వీఆర్వో జెవి.రమణ, ఎస్.రమణ, సర్వేయర్ వినోద్, అపర్ణ, గోవింద్ పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని తానాం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో రీ సర్వే చేయాలని 31 మంది రైతులు వినతి పత్రాలు సమర్పించారు. తానాంలో ఉన్న ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ఈ.బోనంగి రెవెన్యూ, కె.గొర్లివానిపాలెం గ్రామ నివాసి చిప్పాడరామారావు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు జి.శ్రీనివాస్, సిహెచ్.శ్రీను, పివివి.శ్రీను పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలో తామరబ్బ గ్రామంలో గురువారం నిర్వహించి రెవెన్యూ గ్రామసభలో రైతులు మాట్లాడుతూ రీ సర్వే సందర్భంగా చాలా మంది రైతుల భూములను ఏ కారణాలు లేకుండా రెవెన్యూ రికార్డుల్లో నుంచి తొలగించారని తెలిపారు. కోల్పోయిన రైతుల భూములను తిరిగి మరలా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని తహసీల్దార్ లక్ష్మీదేవిని రైతులు కోరారు. దీనికి స్పందించిన ఆమె రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించి తగు న్యాయం చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ గోవిందరాజులు, విఆర్ఒ దేముడమ్మ, కూటమి నాయకులు మొసలి పైడిరాజు, శెట్టి మంగరాజు, మొసలి తమ్మయ్య, శెట్టి అప్పలకొండ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నక్కపల్లి: భూములు రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామ సభల ద్వారా సమస్యలు పరిష్కరిస్తామని తహసిల్దార్ నరసింహామూర్తి అన్నారు. మండలంలోని గురువారం రమణయ్యపేటలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. రెవెన్యూ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు.

నర్సీపట్నం టౌన్: మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో గ్రామసభను ఆర్డిఓ వివి రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. భూ సమస్యలు ఉంటే వాటిని త్వరిత గతిన పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామని ఆర్డిఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఎల్ రామారావు పాల్గొన్నారు

గొలుగొండ: మండలంలోని పాతమల్లంపేట పంచాయతీ కొత్తపాలెం గ్రామంలో రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. తహశీల్దార్ శ్రీనివాసరావు రీసర్వే లో తలెత్తిన భూసమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ చైనులు, సర్పంచ్ ఆదిలక్ష్మి, ఆనంద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల: రీ సర్వేలో తప్పులను సరి చేసేందుకు సంకపూరు గ్రామంలో తహసిల్దార్ తిరుమల బాబు ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం వద్ద గ్రామ సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు రీ సర్వే పై ఎదుర్కొన్న ప్రతి సమస్యను తీర్చేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. గ్రామంలో 883 ఎకరాల భూమికి మొదటి విడత లో సర్వే నిర్వహించామని, ఇందులో జిరాయితి 580, ప్రభుత్వ భూమి 116, దేవాలయం భూమి 11 ఎకరాలు, ఇనామ్ భూమి 124 ఎకరాలు ఉన్నట్లు తెలిపారు. రీ సర్వేలో భాగంగా గ్రామానికి 1864 సర్వే రాళ్ళు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాదాపు 40 వరకు ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. భూమి తక్కువగా రావడం, ఒకరి భూమి మరొకరికి నమోదు కావడం వంటి సమస్యలే అధికంగా అందినట్లు తెలిపారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కోటవురట్ల తహశీల్దార్

ఓ బాధితురాలు మట్లాడుతూ, గ్రామానికి చెందిన చిటికెల సింహాచలం అనే మహిళకు 63 సెంట్లు భూమికి గాను కేవలం ఏడు సెంట్లు భూమిని మాత్రమే చూపుతుందని, తన తోటి కోడలు పేరున నమోదు చేయడంతో గతంలో ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలు ఆధారాలతో అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని తెలిపారు.

అదేవిధంగా లాలం అప్పలనాయుడు అతనికి గతంలో 2.26 ఎకరాల భూమి ఉండగా ప్రస్తుతం 1.26 ఎకరాలు మాత్రమే నమోదు చేసి పాసుబుక్కులు అందించారని బాధితులు వాపోయారు. భూ యజమాని ఫోటో మార్పు, ఆధార్ నెంబర్ మార్పులపై ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మి, జనసేన పార్టీ మండల అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, ఉప తహసిల్దార్ రమేష్, మండల సర్వేయర్ శ్రీనివాస్, రెవెన్యూ అధికారి పి దొర పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించాలి

గతంలో నాకు రెండు ఎకరాల 20 సెంట్లు భూమి ఉండేదని ప్రస్తుతం రీ సర్వే కారణంగా ఎకరా ఇరవై ఆరు సెంటులతో పాసుబుక్ అందజేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు.

లాలం అప్పలనాయుడు

భూమి తక్కువగా నమోదయ్యింది

63 సెంట్ల భూమికి గాను ఏడు సెంట్లు భూమి మాత్రమే చూపిస్తుందని అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగిన పట్టించుకోలేదు. ఆడపిల్లలతో కార్యాలయాల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోలేదు.

చిటికెల సింహాచలం

పశువైద్య కేంద్రంలో రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట పశు వైద్య కేంద్రాన్ని పాడేరు పశు సంవర్ధక ఉప సంచాలకులు సీహెచ్. నరసింహులు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్థానికంగా జరుగుతున్న పశు సేవలపై పశు వైద్యురాలు శిరీషను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం సంయుక్త సంచాలకులు రాంబాబు, గొలుగొండ పశువైద్యులు రమేష్ పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న నరసింహులు

బాలికలకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం గర్ణికం కస్తూరిబా గాంధీ గురుకుల విద్యాలయంలో గురువారం కిషోర్ బాలికలకు చోడవరం సిహెచ్‌సి గైనిక్ వైద్యులు స్మృతి, రావికమతం వైద్యాధికారి శ్రీనివాస్ తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం అందించే పౌష్టికహారం క్రమం తప్పకుండా తీసుకుంటే ఎటువంటి రోగాలు దరి చేరవన్నారు. చాలా మంది రక్తహీనతతో బాధపడుతున్నారని, ఇందుకోసం పాఠశాల లో సరఫరా చేసే చక్కీలతో పాటు ఐరన్ టాబ్లెట్స్ వేసుకోవాలని సూచించారు. వర్షాలు పడుతున్న దృష్ట్యా వేడినీళ్ల తాగాలని, ఆహారం వేడిగా తినాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్షిస్తున్న వైద్యులు



వంటలను పరిశీలిస్తున్న ఎంపీటీసీ, ఛైర్మన్

మధ్యాహ్న భోజనంపై ఆరా

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకాన్ని గురువారం ఎంపీటీసీ సభ్యులు కుంచే మధు, స్కూల్ కమిటీ చైర్మన్ కమిడి బాబురావు పరిశీలించారు. భోజనం రుచి చూసారు. ప్రతిరోజు మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లా రాంబాబు, పల్లా నాగరాజు, ఉపాధ్యాయులు మోహన్, నాయక్ పాల్గొన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న స్పీకర్

పీజీ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు కల్పించాలి

-స్పీకర్‌కు ఎస్ఎఫ్ఐ నేతల వినతి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఆంధ్ర యూనివర్సిటీకి సంబంధించిన పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు అందరికి కల్పించాలని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడను ఎస్ఎఫ్ఐ సభ్యులు గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. నర్సీపట్నం అల్లూరి సీతారామరాజు డిగ్రీ కాలేజీలో పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు ఇవ్వలేదని స్పీకర్ దృష్టికి తీసుకువెళ్లారు. మెరిట్ లేని వారికి ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు ఇవ్వ లేదని, అయితే ప్రైవేట్ కళాశాలల్లో మెరిట్ లేకున్నా అడ్మిషన్లు ఇస్తున్నారని వివరించారు. ఈ అంశంపై స్పందించిన స్పీకర్ ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌కు ఫోన్ చేసి, పీజీ సీట్లు భర్తీపై మాట్లాడారు. ప్రైవేట్ కళాశాలల్లో ఎటువంటి అర్హత లేకుండా అడ్మిషన్లు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రెసిడెంట్ గీతాకష్ణ, డివిజన్ సెక్రెటరీ రాయుడు, మోహన్, సాయి తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న అయ్యన్న

డ్రైయినేజీలను మెరుగుపరచాలి

-స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఇటీవల టౌన్ ప్లానింగ్ అధికారిగా బాధ్యతలు తీసుకున్న సత్యనారాయణ స్పీకర్ అయ్యన్నపాత్రుడను గురువారం ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరచాలని అయ్యన్న పాత్రుడు సూచించారు. వర్షాకాలంలో రోడ్లపైకి నీరు రాకుండా సమర్థవంతమైన డ్రైనేజ్ వ్యవస్థను సక్రమంగా ఏర్పాటు చేయాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థ బాగోలేని కారణంగా ప్రజలు అంటురోగాల బారిన పడే ప్రమాదం ఉన్నందున లోతట్టు ప్రాంతాలను ఎత్తుగా మట్టి పోసి సరి చేసుకోవాలని ఆదేశించారు.

వార్డు సభ్యులకు శిక్షణ



నక్కపల్లిలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి -నక్కపల్లి: పంచాయితీ పాలకవర్గం కలిసికట్టుగా నిర్ణయాలు తీసుకుని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీడీవో డి.సీతారామరాజు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం పంచాయతీల ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లకు పంచాయతీ పాలనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ రత్నం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పంచాయతీ పాలనపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం నిర్వహణ, వీధిలైట్లు, పంచాయతీల ఆస్తులు పరిరక్షణ పై అవగాహన కల్పించారు. పంచాయతీ అభివృద్ధి పాలకవర్గంపై ఆధారపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నానాజీ పాల్గొన్నారు.



భీమిలిలో మాట్లాడుతున్న ఇఒపిఆర్‌డి

పద్మనాభం : స్థానిక మండలపరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీల ఉపసర్పంచ్‌లు, ఇద్దరేసి వార్డు సభ్యుల శిక్షణను గురువారం ప్రారంభించారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల్లోని సమస్యలు, వివిధరకాల పన్నులు, ఇతర ఆదాయ వనరులపై ఉపసర్పంచ్, వార్డుసభ్యులకు అవగాహన ఉండాలని, నిధులు సమకూరితేనే అభివృద్ధి సాధ్యమని శిక్షణలో వివరించారు. ఎంపిడిఒ విజయకుమార్, ఇఒపిఆర్‌డి మీనాకుమారి పాల్గొన్నారు.

ఆనందపురం: పంచాయతీ సాధారణ పరిపాలన విధానంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపసర్పంచు, వార్డు సభ్యులకు శిక్షణ నిర్వహించారు గ్రామపంచాయతీ సాధారణ పరిపాలన విధానం, గ్రామపంచాయతీలో లేఔట్లు, ఎపిపిఆర్ 1994 చట్టం నిబంధనలు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుద్దీపాల నిర్వహణ, పంచాయతీలకు ఆదాయ వనరులు, ఆర్థికనిర్వహణ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సామాజిక సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఎంపిడిఒ డాక్టర్ జానకి, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ, ఎన్ఐఆర్‌డి నాగరాజు, కార్యదర్శులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : మండలంలోని 16 పంచాయతీల ఉప సర్పంచ్‌లు, ఒక్కో పంచాయతీ నుంచి ఇద్దరేసి వార్డు సభ్యులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండురోజుల శిక్షణను గురువారం ఎంపిపి డివిఎస్ఎస్ఎన్ రాజు ప్రారంభించారు. గ్రామ పంచాయితీ అభివృద్ధిలో ఉప సర్పంచ్, వార్డు సభ్యుల పాత్ర, అభివృద్ధి ప్రణాళికల తయారీ, వాటి అమలుపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విస్తరణాధికారి కనకల రమేష్‌నాయుడు వివరించారు.

నట్టల నివారణ మందులు పంపిణీ

ప్రజాశక్తి- కోటవురట్ల: గ్రామీణ ప్రాంతాలలో రైతులు గొర్రెలు మేకలకు వ్యాపించే నట్టల నివారణ పట్ల నిర్లక్ష్యం చేయరాదని పశుసంవర్ధక శాఖ డాక్టర్ నరేష్ అన్నారు గురువారం ఆయన కోటవురట్ల, మాకవరపాలెం మండలాలలో ఈనెల 16 నుంచి 30 వరకు నిర్వహించే నట్టల నివారణ కార్యక్రమం లాంఛనంగా ప్రారంభించారు.

గొలుగొండ: మండలంలో ఈ నెల 31వ తేదీ వరకు అన్ని గ్రామాలలోని గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేయడం జరుగుతుందని గొలుగొండ ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు డాక్టర్ రాంబాబు తెలిపారు. గురువారం కొమిర గ్రామంలో ఈ నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చందక నరసింహులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రంలో గొలుగొండ పశువైద్యాధికారి రమేష్, కేడిపేట పశువైద్యాధికారి శిరీష, టిడిపి ప్రతినిధి నాయుడు, పశు సంవర్ధక అసిస్టెంట్ అనూష పాల్గొన్నారు.



మందు వేస్తున్న పశు వైద్యాధికారి

చర్చి సమీపాన మద్యం షాపు ఏర్పాటుపై..

మహిళల నిరసన

ప్రజాశక్తి -కొత్తకోట:క్రైస్తవ చర్చ్ పక్కనే మద్యం దుకాణం ఏర్పాటు పై పలువురు మహిళలు నిరసన చేపట్టారు. తక్షణమే మరో చోటుకు మార్పు చేసుకోవాలని లేదంటే తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు.గురువారం చర్చ్ ఫాస్టర్ గరగా శ్రీనివాసరావు, సభ్యులు గరగా జ్యోతి, భోగది నాగ, నక్కా లక్ష్మి, విశారపు అప్పలరాజు తదితరులు మాట్లాడుతూ, కొత్తకోట గ్రామంలో మోదునా యుడు రైస్ మిల్లుకు సమీపం (మాకవరపాలెం రోడ్డు)లో చర్చ్ ఆఫ్ క్రీస్తు సొసైటీని గత కొన్నేళ్లుగా (రిజిస్టర్ నెం: 895 ఆఫ్ 2019)తో సుమారు 150 మంది సభ్యులతో నిర్వహిస్తున్నామన్నారు. ఈ చర్చ్ పక్కన కొత్తగా మంజూరు అయిన మద్యం దుకాణం ఏర్పాటు చేయడం తో తమకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉందని వాపోయారు. దేవాలయం పక్కన మద్యం దుకాణం పై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం హిందూ, క్రిస్టియన్, ఆలయాలతో పాటు పాఠశాలలకు సమీపంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకూడదన్నారు.మాడుగుల మండలం జమ్మి దేవి పేటకు చెందిన మద్యం వ్యాపారి దౌర్జన్యంగా చర్చి పక్కన మద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్నారని వారు ఆరోపించారు. తక్షణమే మద్యం దుకాణం ఏర్పాటును విరమించుకొని మరో చోటుకు తరలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యపై కొత్తకోట పోలీసులతో పాటు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని క్రైస్తవ భక్తులు స్పష్టం చేశారు.



నినాదాలు చేస్తున్న మహిళలు



సిబ్బందితో మాట్లాడుతున్న సభ్యులు

వైద్య సేవలపై టాస్క్ ఫోర్స్ టీం సభ్యుల ఆరా

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట పి హెచ్ సి పరిధిలో కొత్తకోట సచివాలయం2 హెల్త్ క్లినిక్‌ను గురువారం జిల్లా టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు డి పిఎంఓ డాక్టర్ లూసి కార్డియా, యస్ఓ రామచంద్రరావు, డిపిఓ జగదీశ్, దినేష్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా కొత్తకోట హెల్త్ క్లినిక్ లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్య పరిస్థితులపై విచారణ చేసారు. ఈ సందర్భంగా గర్భిణీలకు, కిశోర్ బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. పాఠశాలకు వెళ్ళి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. హెల్త్ సెంటర్ నిర్వహణలో తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆరోగ్యకేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉండి వచ్చిన రోగులకు వైద్యసేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ రామారావు, హెచ్‌యస్ రమణ, హెచ్‌వి ఎర్రమ్మ, హెల్త్ సిబ్బంది వరలక్ష్మి, కన్నతల్లి, కృష్ణవేణి, అమ్మాజీ, మంగ, రత్నం, సంతోషి, లక్ష్మి, జోష్నా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నిర్వాసితులు

చట్ట ప్రకారం పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూములకు సంబంధించి నిర్వాసితుల సమస్యలు పరిష్కరిం చేందుకు గాను తహసిల్దార్ నరసింహామూర్తి ఆధ్వర్యంలో అమలాపురం పంచాయతీ మూలపర్ర, డిఎల్ పురం గ్రామాల్లో గ్రామసభ నిర్వహించారు. నిర్వాసితులు పలు సమస్యలపై వినతులు అధికారులకు అందజేశారు. ముఖ్యంగా పరిశ్రమల ఏర్పాటుకు భూములు స్వాధీనం చేసుకునే నాటిని కటాఫ్ తేదీగా పరిగణించి అప్పటికి 18 సంవత్సరాల నుండి ప్రతి ఒక్కరికి 15 లక్షలు, ఇల్లులు కోల్పోతున్న కుటుంబంలో 18 సంవత్సరాల నుండి ప్రతి ఒక్కరికి 25 లక్షలు ప్యాకేజీ చెల్లించాలన్నారు. మూలపర్రలో గ్రామకంఠం, రాస్తాలో ఉన్న ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలని ఈ కార్యక్రమంలో డిటి అన్నాజీరావు, ఆర్ఐ కన్నబాబు, ఏపీఐఐసీ అధికారులు,సర్పంచ్ లు పెదపూడి శంకర్రావు, కిల్లాడ కష్ణ, ఉప సర్పంచ్ గంటా నరసింగరావు, డిఎల్ పురం ఎంపీటీసీ సభ్యులు కనకారావు, మాజీ సర్పంచ్ గింజాల లక్ష్మణరావు, చందర్రావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు గింజాల వెంకటరమణ పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి-రోలుగుంట:మండల ప్రజాపరిషత్ సమావేశం గురువారం ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ప్రతిపక్ష పార్టీ సభ్యులు హాజరు కాక పోవడంతో సమావేశం తూతూ మంత్రంగానే జరిగింది. కుసర్లపూడి సర్పంచ్ మాట్లాడుతూ, జగనన్న కాలనీకి రహదారి సౌకర్యం కల్పించక పోవడంతో కరెంట్ లేక లబ్ధిదారులు అందరూ నిర్మాణాలు పూర్తి చేయలేదన్నారు. ఇటీవల ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు 5లక్షల రూపాయలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. పంచాయతీ నుండి 25 శాతం నిధులు కంట్రిబ్యూషన్ చేయడానికి తీర్మానం చేయడం జరిగిందన్నారు. మండలంలో ఉపాధి హామీ పథకం నిధులు ఎవరికి ఇచ్చినా పంచాయతీ తీర్మానం సర్పంచ్‌లు ఇవ్వాలని ఎంపిపి కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు

9 మంది విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం టి.అర్జాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన 9 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల పిడి రమేష్ నాయుడు చెప్పారు. గురువారం స్థానిక విలేకరులకు తెలిపిన వివరాల మేరకు... స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15 న గోవాడలో ఎంపిక ప్రక్రియ జరిగిందన్నారు. ఎంపికయిన విద్యార్థులు నవంబర్ 6,7 తేదీలలో అన్నమయ్య జిల్లాలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు అండర్ 14 బాలుర బాలికల విభాగం లో ఏడుగురు విద్యార్థులు ఎంపిక కాగా అండర్ 17బాలుర, బాలికల విభాగంలో ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. బాలుర విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలు నవంబర్‌లో రాజమహేంద్రవరంతో పాటు బిక్కవోలులో పోటీలను నిర్వహిస్తారన్నారని పీడి తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో ఆర్.శృతి, యూగిరిజ, ఏ.లక్ష్మికుమారి, ఎం.భారతి, బాలుర విభాగంలో ప్రవీణ్ కుమార్, లోకేష్, మహంతి, అండర్ 17 బాలుర విభాగంలో ఆర్.ప్రసాద్ బాలికల విభాగంలో ఎం.రిషితలు పోటీలో పాల్గొనడానికి ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం నాయుడు, సిఆర్‌పి రామారావు, గ్రామ సర్పంచ్ పాల్గుణ, వైస్ ఎంపీపీ భవాని ప్రసాద్, స్కూల్ కమిటీ చైర్మన్ పెంటారావు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యార్థులకు చేరువగా విజ్ఞానాత్మక కేంద్రాలు

-పర్యాటక కేంద్రాల్లో రాయితీపై ప్రవేశాలు
-జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎడ్యుకేషనల్ టూరిజంలో భాగంగా జిల్లా పరిధిలోని పర్యాటక విజ్ఞానాత్మక కేంద్రాలను విద్యార్థులకు చేరువ చేయాలని, తద్వారా వారిలో మరింత విజ్ఞానాన్ని పెంపొందించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. వివిధ మార్గాల ద్వారా ఎడ్యుకేషనల్ టూరిజంపై విద్యార్థుల్లో చైతన్యం నింపాలని సూచించారు. నగర పరిధిలో ఉన్న మెరైన్ మ్యూజియం, సి.హారియర్, టియు -142, మారిటైమ్ మ్యూజియం, జూ పార్కు, తీరప్రాంత పర్యావరణ వ్యవస్థపై అవగాహన కల్పించే నిమిత్తం మడ అడవుల పరిశోధన కేంద్రం తదితర ప్రముఖ కేంద్రాల్లో విద్యార్థులను రాయితీతో కూడిన ప్రవేశాలు కల్పించాలని చెప్పారు. ఈ మేరకు ఎడ్యుకేషనల్ టూరిజానికి సంబంధించిన బ్రోచర్లను పర్యాటక శాఖ అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని పర్యాటక, విద్యా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ విద్యా సంస్థల విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు, ప్రయివేటు విద్యా సంస్థల విద్యార్థులకు రూ.10 టికెట్‌పై ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి విద్యా సంస్థలు భాగస్వామ్యం అయ్యేలా కార్యాచరణ రూపొందించి ముందుకు వెళ్తున్నట్లు జిల్లా పర్యాటక అధికారి జ్ఞానవేణి తెలిపారు.

కొత్త మంచినీటి పైపులైన్‌కు ప్రతిపాదన

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : మహా విశాఖ నగరంలో వాణిజ్య, పరిశ్రమల అభివృద్ధికి అనుగుణంగా అదనపు అవసరాలకు సరిపడేలా కొత్తగా మంచినీటి పైప్ లైన్‌ను నిర్మించుటకు ప్రతిపాదన సిద్ధం చేసినట్లు జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన కోరమాండల్ గెస్ట్ హౌస్‌లో నగరంలోని పరిశ్రమల యాజమాన్యాల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, జివిఎంసి పరిధిలో గల పరిశ్రమల అవసరాలకు సరిపడా మంచినీటిని సరఫరా చేయుటకు ప్రత్యేక పైప్ లైన్‌ను నరవ నుంచి షీలానగర్ మీదుగా పోర్టు రోడ్డులో 1300 ఎంఎం వ్యాసం గల ఎమ్ఎస్ పైప్ లైన్‌ను అమృత్ 2.0 పథకంలో భాగంగా పిపిపి పద్ధతిలో ఏర్పాటు చేయుటకు ప్రతిపాదన సిద్ధం చేసినట్లు పరిశ్రమల ప్రతినిధులకు తెలిపారు. ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలకు వాణిజ్య, పరిశ్రమల అభివృద్ధికి అనుగుణంగా మంచి నీటిని సరఫరా చేయుటకు ఈ పైపులైను నిర్మాణానికి ప్రతిపాదించినట్లు చెప్పారు. దీనికి నగరంలోని పరిశ్రమల భాగస్వామ్యం చాలా అవసరమని కమిషనర్ పేర్కొన్నారు.

విశాఖలో అమెజాన్ ఫ్రెష్ అమ్మకాల జోరు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అమెజాన్ ఇండియా గ్రేట్ ఫెస్టివల్ సమయంలో విశాఖపట్టణంలో అమెజాన్ ఫ్రెష్ అమ్మకాలు అత్యంత వేగంగా జరిగాయని సంస్థ డైరెక్టర్ శ్రీకాంత్ శ్రీ రామ్ చెప్పారు. నోవాటేల్ హోటల్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అమెజాన్ ఫ్రెష్ 2024లో 2.3 రెట్ల ఇయర్-ఆన్-ఇయర్ వృద్ధిని సాధించిందన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సమయంలో కిరాణా సరుకులపై ఫ్లాట్ రూ. 400 క్యాష్ బాక్‌ను, అమెజాన్ ఫ్రెష్‌పై 50 శాతం వరకు తగ్గింపును అందించామని తెలిపారు.

ఆరోగ్య కేంద్రాల సిబ్బంది అందుబాటులో ఉండాలి

-జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో వర్షాలు అధికంగా కురుస్తున్నాయని, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది అందరూ హెడ్ క్వార్టర్లలో అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ప్రోగ్రాం అధికారులు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల సేవలపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా మాతా, శిశు ఆరోగ్య సేవలు, మాతృ మరణాలు, శిశు ఆరోగ్య సేవలు, శిశు మరణాలపై వివరంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాలు అధికంగా కురుస్తున్నందున తాగునీటికి సంబంధించిన వనరులను క్లోరినేషన్ చేయించాలని, నీటి నిల్వలు లేకుండా, దోమలు ప్రబలకుండా వైద్య అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ అర్హులైన వారందరికీ అందేటట్లు చూడాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ గౌరీ శంకర్, డాల్టో డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, పిఎంఒహెచ్ డాక్టర్ నరేష్ కుమార్, డిపిఎమ్ఒ డాక్టర్ బి.ఉమాపతి, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ ఎన్‌వి.సమత, జిల్లా మలేరియా అధికారి తులసి, ఎంపిహెచ్ఇఒ నాగభూషణం పాల్గొన్నారు.

అన్నసమారాధన ప్రారంభం

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం నుంచి ఉచిత వారాంతపు అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ జి.సత్యదేవ్, ఎంపీటీసీ పూడి దేవ ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. తొలి రోజు అన్నదాన కార్యక్రమానికి స్థానిక సిమెంట్ వ్యాపారి ఆలయ కమిటీ సభ్యులు పెనుగొండ మల్లేశ్వరరావు - రమాదేవి దంపతులు ఆర్థిక సాయం చేసారు. ఇకపై ప్రతి గురువారం ఆలయ ఆవరణలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పెనుగొండ నూకేశ్వరరావు, వినోద్, పండు, విశ్రాంత ఉపాధ్యాయులు బేతా నూకరాజు, వార్డ్ మెంబర్ పూడి నాగరాజు, అప్పాన దేముళ్ళు, నందారపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.